

నిరుద్యోగ వేద పండితుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం, సెప్టెంబరు20 (ఆంధ్రజ్యోతి): వేద విద్యను అభ్యసించిన నిరుద్యోగ వేద పండితులకు నిరుద్యోగ భృతి కల్పించడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ కె.ఎల్.సుధారాణి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26 లోపు పార్వతీపురంలో తమ కార్యాలయానికి దరఖాస్తులు అందించాలని పేర్కొన్నారు. నెలకు రూ.3 వేల చొప్పున నిరుద్యోగ భృతి అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. వేద విద్య సర్టిఫికెట్లు, ఆధార్ నకలు, ఏ ఉద్యోగం చేయడం లేదని తెలియజేస్తూ స్వీయ ధ్రువపత్రంతో దరఖాస్తులను అందజేయాలని సూచించారు.

కూటమి పాలన.. కొండంత భరోసా



మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

- కూటమి ప్రభుత్వానికి వంద రోజులు
- ఎన్నో హామీలు అమలు
- జిల్లాలో అభివృద్ధి పనులకు నిధుల మంజూరు

కంటైనర్ ఆసుపత్రుల ఏర్పాటు...

గిరిజన ప్రాంతాల్లో డోలీ మోతలకు చెక్ పెట్టాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం కంటైనర్ ఆసుపత్రులకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు సాలూరు మండలం గిరిశిఖర గ్రామం కరడవలసలో కంటైనర్ ఆసుపత్రి ద్వారా గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవలు అందించేందుకు సర్వం సిద్ధం చేస్తున్నారు. దశల వారీగా మిగిలిన గిరి శిఖర ప్రాంతాల్లోనూ వాటిని ఏర్పాటు చేయనున్నారు.

పింఛన్‌దారులకు..

ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సామాజిక పింఛన్ సొమ్మును పెంచారు. వృద్ధులు, వితంతవులకు అందించే పింఛన్ సొమ్మును రూ.మూడు వేల నుంచి రూ. నాలుగు వేలకు పెంచారు. మొదటి నెలలో రూ.4 వేలతో పాటు గత మూడు నెలల బకాయి రూ.3 వేలను కలిపి ఒక్కో లబ్ధిదారునికి రూ.7 వేల చొప్పున అందించారు. ప్రతినెలా సకాలంలో రూ.4 వేల చొప్పున పింఛన్ అందిస్తూ.. పింఛన్‌దారులకు భరోసా కల్పిస్తున్నారు. అదేవిధంగా దివ్యాంగులు, పూర్తి వైకల్యంతో ఉన్న వారికి, దీర్ఘకాలిక రోగులకు కూడా రెట్టింపు పింఛన్ అందిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ కాలంలో ఏటా రూ.250 పెంచుతూ చివరి దశలో ఎన్నికలకు ముందు రూ.3వేల వంతున పింఛన్ అందజేశారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- మంత్రి సంధ్యారాణి

సాలూరు, సెప్టెంబరు 20: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. సాలూరు నియోజకవర్గం మామిడిపల్లిలో శుక్రవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రతి కుటుంబాన్నీ పలకరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలన విజయవంతంగా సాగిందని తెలియజేస్తూ.. కరపత్రాలు, స్టిక్కర్లును పంపిణీ చేశారు. ప్రజా ఉపయోగ పనులు మాత్రమే ప్రభుత్వం చేపడుతుందని స్పష్టం చేశారు. సీఎం ఆదేశాల మేరకు ప్రజల్లోకి వెళ్లి.. వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తామని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అన్నింటా వెనుకబడిపోయిందన్నారు. అన్ని రంగాలూ కుదేలైపోయాయని తెలిపారు. రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పథంలో నడిపించేందుకు సీఎం చంద్రబాబు శాయశక్తులా కృషి చేస్తున్నారన్నారు. ఒకపక్క అభివృద్ధి కార్యక్రమాలు.. మరోపక్క సంక్షే మ పథకాలు అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందన్నారు. అనంతరం వంద రోజుల్లో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి వివరించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్ సొమ్ము పెంచిన ప్రభుత్వం ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దు, 16,437 డీఎస్సీ పోస్టులకు నోటిఫికేషన్, అన్న క్యాంటీన్ల ప్రారంభానికి చర్యలు చేపట్టిందని వివరించారు. జిల్లాలో జీవనోపాధి కల్పన, పర్యట కం, వ్యవసాయం, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. జిల్లాలో రక్త హీనత, మాతా శిశు మరణాల నివారణకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. అనంతరం 'పొలంబడి పిలుస్తోంది' వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. వేదిక వద్ద మహిళలు, చిన్నారులతో కలిసి మంత్రి సరదాగా కోలాటం ఆడారు. అంతకముందు ఆమెపై మామిడిపల్లివాసులు పూలవర్షం కురిపించి హారతులతో స్వాగతించారు. డీఎఫ్‌వో ప్రసూన, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భంజ్‌దేవ్, టీడీపీ నాయకులు అన్నపూర్ణ, తిరు పతిరావు, రమాదేవి, పరమేష్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

- పార్వతీపురం మండలం ములగ పంచాయతీలో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, పాలకొండ మండలం ఎల్‌ఎల్ పురంలో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. కూటమి శ్రేణులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం, సెప్టెంబరు20 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ పాలనలో పూర్తిగా అగాథంలో కూరుకుపోయిన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను నిలబెట్టే ప్రయత్నం చేస్తూనే, సామాన్యులు, బాధితులకు ఉన్నంతలో ఉపశమనం కలిగించడానికి చంద్రబాబు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈ మేరకు తొలి వంద రోజుల్లో గట్టి ప్రయత్నం చేసింది. గతి తప్పిన రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెడుతోంది. అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యత ఇస్తూ ముందుకు దూసుకుపోతుంది. సీఎంగా చంద్రబాబు పగ్గాలు చేపట్టిన వంద రోజుల్లోనే ఎన్నికల్లో ఇచ్చిన ఎన్నో హామీలను అమలు చేశారు. పింఛన్ల పెంపు, ఉచిత ఇసుక, అన్నక్యాంటీన్ల పునఃప్రారంభం, ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దు, మెగా డీఎస్సీ, ఇంటర్ విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు వంటి హామీలను నెరవేర్చారు. త్వరలో ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం అమలు కానుంది. మిగిలిన హామీలను కూడా దశలవారీగా అమలు చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తోంది. మరోవైపు జిల్లాలో వివిధ అభివృద్ధి పనులకు కూడా కోట్లాది రుపాయలు మంజూరు చేశారు. దీంతో కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రూ.200 కోట్లతో అభివృద్ధి పనులు...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన జిల్లాలోని నాలుగు నియోజక వర్గాల్లో సుమారు రూ.200 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే సుమారు రూ.70 కోట్లతో బీటీ రహదారులను చేపట్టింది. మరో రూ.130 కోట్లతో సాలూరు, పార్వతీపురం, పాలకొండ, కురుపాం నియోజక వర్గాల్లో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం చేపట్టేందుకు కసరత్తు ప్రారంభించింది. ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తోంది.

- జిల్లాలోని ఆర్‌అండ్‌బీ రోడ్లకు మోక్షం లభించింది. వాటి మరమ్మతులకు కూటమి ప్రభుత్వం సుమారు రూ.12 కోట్లు మంజూరు చేసింది. వర్షాకాలం ముగిసిన వెంటనే సీతానగరం వంతెన నిర్మాణం పనులు కూడా పునఃప్రారంభం కానున్నాయి.
- ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పూర్ణపాడు-లాబేసు వంతెన నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

సీతంపేటలో గిరిజన గర్భిణుల వసతిగృహం..

మతాశిశు మరణాల నివారణే లక్ష్యంగా గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సాలూరు, గుమ్మలక్ష్మీపురంలో గిరిజన గర్భిణుల వసతి గృహాలను ఏర్పాటు చేశారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం వాటిపై నిర్లక్ష్యంగా వ్యవహరించింది. వాటి నిర్వహణను గాలికొదిలేసింది. ఈ నేపథ్యంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాటిపై దృష్టి సారించింది. అంతేగాకుండా సీతంపేటలో అదనంగా గిరిజన గర్భిణుల కోసం మరో వసతి గృహం ఏర్పాటు చేసింది.



పాలకొండ: ఎల్ఎల్ పురంలో ఎమ్మెల్యే జయకృష్ణ



పార్వతీపురం రూరల్: ములగలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

తాగునీటి కోసం..

గిరిజన ప్రాంతాల్లో తాగునీటి సమస్య పరిష్కరానికి ఇప్పటికే ప్రతిపాదనలను సిద్ధం చేశారు. ఇటీవల సాలూరు నియోజకవర్గంలోని గిరి శిఖర ప్రాంతాల్లో తాగు నీరు అందించేందుకు మంత్రి సంధ్యారాణి రూ.3 కోట్లు మంజూరు చేయించారు.

సాగునీటి ప్రాజెక్టులకు...

గత ఐదేళ్లు కనీస నిర్వహణకు నోచని సాగునీటి ప్రాజెక్టులపై కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా శ్రద్ధ వహించింది. కాలువల్లో పూడికలు, పిచ్చిమొక్కల తొలగింపు, ఆధునికీకరణ పనులకు శ్రీకారం చుట్టింది. వీఆర్ఎస్, పెద్దగెడ్డ, పెదంకలం, ఒట్టిగెడ్డ ప్రాజెక్టుల పరిధిలో వ్యవసాయ భూములకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించారు.

విద్యార్థులకు ఊరట...

గత వైసీపీ ప్రభుత్వం విద్యా వ్యవస్థను అస్తవ్యస్తం చేసింది. దీంతో విద్యార్థులకు ఇబ్బందుల తప్పలేదు. ఈ నేపథ్యంలో కూటమి సర్కారు ప్రభుత్వ విద్య బలోపేతానికి చర్యలు చేపట్టింది. పదో తరతగతి వరకు సీబీఎస్ఈను రద్దు చేసి స్టేట్ సిలబస్ ద్వారా విద్యాబోధన జరిగే విధంగా చర్యలు తీసుకుంది.

పేదల ఆకలి తీర్చేందుకు..

పేదల ఆకలి తీర్చాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం జిల్లాలో నాలుగు నియోజక వర్గాల్లోనూ అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. ఇప్పటికే పార్వతీపురంలో క్యాంటీన్ పునఃప్రారంభానికి సర్వం సిద్ధం చేశారు. ఇక సాలూరు, పాలకొండ, కురుపాంలో భవన నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలో అవి అందుబాటులోకి రానున్నాయి.

అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులకు...

జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు ఇటీవల కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కేంద్రాలకు పక్కా భవనాలనిర్మాణంతో పాటు మరుగుదొడ్లు, తాగునీరు ఇతర సదుపాయల కోసం వాటిని వినియోగించనున్నారు.

మహిళా సంఘాలకు..

జిల్లాలో 1,165 మహిళా సంఘాలకు కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో రూ. 71.69 కోట్లను రుణంగా అందించింది. శ్రీనిధి ద్వారా 3,356 మందికి రూ.20.95 కోట్లు, టీఎస్‌పీ ఏరియాలో మరో 320 మందికి సుమారు 2 కోట్లు అందజేశారు.

పెద్దకొడుకులా ఆదుకున్నారు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నెలకు నాలుగు వేల చొప్పున పింఛన్ అందుతుంది. మొదటి నెల మూడు వేలు బకాయిలతో కలిపి మొత్తం 7 వేలు అందుకున్నా. సీఎం చంద్రబాబు పెద్దకొడుకులా ఆదుకున్నారు.

-కె.సుభద్ర, లక్ష్మీనారాయణపురం, పార్వతీపురం మండలం

మేలు మరువలేం..

అన్న క్యాంటీన్ మాలాంటి వారికి ఎంతో ఉపయోగం. శనివారం పార్వతీపురంలో అది పునఃప్రారంభం కానుంది. దీంతో పేదలు కడుపునిండా తినగలుగుతారు. ఈ విషయంలో సీఎం చంద్రబాబు మేలు మరువలేం.

-కె.నాగేశ్వరరావు, వేతనదారుడు, పార్వతీపురం

విధుల్లోకి పాలకొండ డీఎస్పీ



డీఎస్పీ రాంబాబు

పాలకొండ: పాలకొండ డీఎస్పీగా ఎం.రాంబాబు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. శ్రీకాకుళం ఇంటిలిజెన్సీ డీఎస్పీగా విధులు నిర్వహించిన ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. తొలుత ఉత్తరాంధ్ర ఆరాధ్యదైవం కోటదుర్గమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈవో డీఎస్పీకి కండువా కప్పి అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందించారు. అనంతరం డీఎస్పీ రాంబాబు మాట్లాడుతూ డివిజన్‌లో శాంతిభద్రతలపై దృష్టి పెడతామని తెలిపారు. గంజాయి, తదితర మాదక ద్రవ్యాల అక్రమ రవాణా కట్టడికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. వచ్చే నెల మూడో తేదీ నుంచి ప్రారంభమయ్యే కోటదుర్గమ్మ దసరా ఉత్సవాలకు పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కాగా గతంలో ఇక్కడ డీఎస్పీగా పనిచేసిన జీవీ కృష్ణారావును వీఆర్‌కు పంపించారు. ● **బెలగాం:** పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు శుక్రవారం పార్వతీపురంలో ఎస్పీ మాధవరెడ్డిని మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ప్రజలకు అందుబాటు లో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పని చేయాలని ఎస్పీ ఆయనకు సూచించారు. ప్రజలకు సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించాలని, ఏవోబీ సరిహద్దు ప్రాంతాలపై నిఘాపెట్టాలని తెలిపారు.

శాస్త్రోక్తంగా పందిరి రాట

- పైడిమాంబ సిరిమానోత్సవానికి అంకురార్పణ
- మండల దీక్షలూ ప్రారంభం



పైడిమాంబ సిరిమానోత్సవానికి పందిరి రాట వేస్తున్న దృశ్యం

విజయనగరం రూరల్, సెప్టెంబరు 20: పైడిమాంబ సిరిమానోత్సవ సంబరానికి నాందిగా భావించే పందిరాట కార్యక్రమం శుక్రవారం శాస్త్రోక్తంగా జరిగింది. పురోహితులు నిర్ణయించిన ముహూర్తం ప్రకారం మూడులాంతర్ల వద్ద ఉన్న చదురుగుడి వద్ద ఉదయం 9.30 గంటలకు, రైల్వే స్టేషన్ వద్ద ఉన్న వనంగుడి వద్ద ఉదయం 11 గంటలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వేద పండితుల వేదమంత్రోచ్చారణలు, మహిళల కోలాటం, దీక్షాదారుల జై పైడిమాంబ నామస్మరణల మధ్య పందిరాట కార్యక్రమం వైభవంగా జరిగింది. పూసపాటి వంశీయురాలు, విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మాట్లాడుతూ.. భక్తుల మనోభావాలను గౌరవిస్తూ, సిరిమానోత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు. ఇప్పటికే జిల్లా అధికార యంత్రాంగం రెండు పర్యాయాలు సమావేశం నిర్వహించి, అందరి అభిప్రాయాలు తీసుకుందన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలని కోరారు. పందిరి రాట కార్యక్రమంలో మహిళలతో కలసి ఎమ్మెల్యే అదితి గజపతి రాజు కొద్ది సేపు కోలాటమాడారు. కార్యక్రమంలో ఆలయ ఈవో డీవీ ప్రసాదరావు, సూపరింటెండెంట్ ఏడు కొండలు, ఆలయ అర్చకుడు వెంకటరావు, ఇతర అర్చకులు, దేవస్థాన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన మండల దీక్షలు

పైడిమాంబ మండల దీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. చదురుగుడి వద్ద భక్తులు పైడిమాంబ మాలలు ధరించారు. 41 రోజుల పాటు ఈ దీక్షను కొనసాగించనున్నారు. సిరిమానోత్సవంలో వీరు భాగస్వాములు కానున్నారు. అర్ధమండల దీక్షలు అక్టోబరు 3 నుంచి ప్రారంభంకానున్నాయి.

నేడు పార్వతీపురంలో అన్న క్యాంటీన్ పునః ప్రారంభం

పార్వతీపురం, సెప్టెంబరు20 (ఆంధ్రజ్యోతి)/ పార్వతీపురం టౌన్: జిల్లాకేంద్రం పార్వతీపురంలో శనివారం అన్నక్యాంటీన్ పునఃప్రారంభించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బెలగాం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సమీపంలో ఉన్న అన్న క్యాంటీన్ ద్వారా రోజుకు సుమారు మూడు వందల మందికి ఆహారం అందించనున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తదితరులు హాజరు కానున్నట్లు ఆయన చెప్పారు.



స్వచ్ఛత ఇదేనా ?

- పారిశుధ్య పనులపై కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ అసంతృప్తి
- ఇద్దరు ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ

సాలూరు,సెప్టెంబరు 20: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలో పారిశుధ్య పనులను కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారుల తీరుపై మండిపడ్డారు. అనంతరం మున్సిపల్ కార్యాల యంలో సిబ్బందితో సమీక్షింరు. శానిటేషన్ పనులు, పురపాలక శాఖకు రావాల్సిన ఆదాయంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఆర్ఐ , జూనియర్ అసిస్టెంట్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. పారిశుధ్య పనులను పక్కాగా చేపట్టాలన్నారు. ప్రత్యేక అధికారులను నియమిస్తామని, కంట్రోల్ రూములను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తామని వెల్లడిం చారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ప్రతిచోటా చెత్తను తీసి, వాటిని డ్రోన్‌తో చిత్రీకరించాలని సూచించారు. ప్రతి ఉద్యోగీ ఒక శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లా పని చేయాలని సూచించారు. పెద్దబజార్ లో సామూహిక మరుగుదొడ్లు , రైతు బజార్‌ను వినియోగంలోకి తేవాలని ఆదేశించారు. పెద్దబజార్‌కు కమిటీ వేసి ఎంత ఆదాయం వస్తుందో ప్లాన్ ఆఫ్ యాక్షన్ సిద్ధం చేయాలన్నారు. గుమడాం వద్ద నీటి శుద్ధి ప్లాంటు పెట్టనున్నామని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న 15 రోజుల లోగా ఇంటి ప్లాన్ అప్రూవల్‌ను ఇవ్వాలన్నారు. అనంతరం పలువురు కౌన్సి లర్లు పట్టణ సమస్యలపై ఆయనకు వినతిపత్రాలు అందజేశారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

'ఇది మంచి ప్రభుత్వం' విజయవంతం చేయాలి

పార్వతీపురం, సెప్టెంబరు20 (ఆంధ్రజ్యోతి): 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ఏ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. శుక్ర వారం కలెక్టరేట్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులతో మాట్లాడారు. మండల ప్రత్యేక అధికారులు ప్రతి ఇంటికీ కరపత్రాలు, స్టిక్కర్లను అందించడమే కాకుండా ప్రభుత్వ కార్యక్రమాలను స్పష్టంగా వివరించాలన్నారు. స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్‌పై గ్రామసభ లను నిర్వహించాలని ఆదేశించారు. వైద్యాధికారులు రోగులకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశిం చారు. ప్రాథమిక వైద్య కేంద్రానికి వస్తున్న వారు ఇబ్బందికి గురికాకూడదని స్పష్టం చేశారు.

1 నుంచి నూతన మద్యం పాలసీ

- అందుబాటు ధరకే చౌక లిక్కర్
- క్వార్టర్ ధర రూ.99
- అన్ని రకాల బ్రాండ్ల విక్రయాలకు చర్యలు

పాలకొండ: మద్యం ప్రియులకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. చౌక మద్యాన్ని(చీప్ లిక్కర్) అందుబాటు ధరలకే అందించాలని నిశ్చయించింది. క్వార్టర్ రూ.99కే అందుబాటులోకి తీసుకురానుంది. సాధారణ లిక్కర్ షాపులతో పాటు కేవలం ప్రీమియం రకం మద్యం బ్రాండ్లు మాత్రమే ఉండే ఎలైట్ షాపుల ఏర్పాటుకూ ఆమోదముద్ర వేసింది. నాణ్యత లేని లిక్కర్ బ్రాండ్లకు చెల్లుచీటి ఇచ్చి.. ఇకపై క్వాలిటీ మద్యాన్ని అందుబాటులోకి తీసుకురానుంది. అదేవిధంగా ప్రభుత్వ మద్యం అమ్మకాలకు స్వస్తి చెప్పనున్నారు. పాత పద్ధతిలోనే ప్రైవేట్ వ్యక్తులు మద్యం షాపులు నడిపేలా కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మొత్తంగా సినలైన బ్రాండ్లతో పాటు తక్కువ రకం మద్యం అందుబాటులోకి తెచ్చేందుకు సర్కారు సర్వం సిద్ధం చేస్తోంది. ప్రజలపై ఆర్థిక భారం తగ్గించేందుకు నూతన మద్యం పాలసీకి శ్రీకారం చుట్టనుంది. వచ్చేనెల నుంచి ఇది అమలులోకి రానుంది.

గత వైసీపీ సర్కారు పాలనలో..

దశల వారీగా మద్యనిషేధం అమలు చేస్తామని హామీ ఇచ్చిన వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అందుకు విరుద్ధంగా వ్యవహరించింది. నాణ్యమైన మద్యం, లిక్కర్ బ్రాండ్లకు మంగళం పాడేసింది. నాసిరకం మద్యాన్ని మందుబాబులకు అంటగట్టింది. అధిక ధరలకు విక్రయించి వారి జేబులతో పాటు ఆరోగ్యాన్ని గుల్ల చేసింది. గత ఐదేళ్లూ మందుబాబులు వైసీపీ ప్రభుత్వ దోపిడీకి గురయ్యారు. పేరుకే ప్రభుత్వ మద్యం దుకాణాలు అయినప్పటికీ వైసీపీ బడా నేతల కనుసన్నల్లోనే అవి నడిచేవనే ఆరోపణలు ఉండేవి. ఎప్పుడూ వినని, చూడని బ్రాండ్లను విక్రయించి.. మందు బాబులను నిలువునా దోచుకున్నారు. నాసిరకం మద్యంతో ఎంతోమంది ఆకస్మాత్తుగా మృతి చెందగా.. ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం కొత్త మద్యం పాలసీపై దృష్టిపెట్టింది.



పెరగనున్న షాపులు

కూటమి ప్రభుత్వం నాణ్యమైన మద్యాన్ని తక్కువ ధరలకు విక్రయించేలా చర్యలు చేపడుతుంది. దీనిలో భాగంగా ప్రభుత్వ మద్యం దుకాణాల స్థానంలో ప్రైవేట్ వ్యాపారుల ద్వారానే అమ్మకాలు జరగనున్నాయి. రూ.2 లక్షలు ఫీజు చెల్లించి ఎవరైనా లక్కీ డ్రాలో పాల్గొని మద్యం షాపును దక్కించుకునే అవకాశం ఉంది. జిల్లాలో ప్రస్తుతం 53 ప్రభుత్వ మద్యం షాపులు ఉన్నాయి. ఐదు బార్లు నడుస్తున్నాయి. ప్రభుత్వం గెజిట్ విడుదల చేసిన తర్వాత వీటి సంఖ్య కాస్త పెరిగే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా క్వార్టర్ మద్యం రూ.99కే విక్రయించాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. నాణ్యమైన లిక్కర్ బ్రాండ్లను కూడా తక్కువ ధరకు అదించేందుకు చర్యలు చేపడుతుంది. ఏదేమైనా గతంతో పోలిస్తే సగం ధరకే తక్కువ రకం మద్యం లభించనుండడంతో మందుబాబులకు పండగే అని చెప్పొచ్చు.

పర్యావరణం - అధ్యయనం

దిక్సూచి DIKSUCHI

పర్యావరణాన్ని ఆంగ్లంలో ఎన్విరాన్‌మెంట్ అంటారు. ఈ పదాన్ని ఫ్రెంచ్ భాష నుంచి గ్రహించారు. ఫ్రెంచ్‌లో ఎన్విరానర్ అంటే చుట్టూ ఆవరించి ఉండటం లేదా చుట్టుకొని ఉండటం అని అర్థం.

నిర్వచనాలు: మనచుట్టూ ఆవరించి ఉన్న గాలి, నీరు, నేల, జంతువులు, వృక్షాలు అనగా జీవ, నిర్జీవ వ్యవస్థల సమ్మేళనాన్ని 'పర్యావరణం' అంటారు. (లేదా) మానవుని చుట్టూ పరిసరాలు ఏర్పడటానికి కారణమయ్యే సాంఘిక, ఆర్థిక, జీవ, భౌతిక రసాయనిక కారకాల సమ్మేళనాన్ని పర్యావరణం అంటారు.

డగ్లస్, హోలెండ్: జీవరాశుల జీవితాన్ని, స్వభావాన్ని, ప్రవర్తనను, అభివృద్ధిని, పరిపక్వతను ప్రభావితం చేసే అన్ని బాహ్య శక్తులు, ప్రభావాలు, పరిస్థితుల సమిష్టి స్వరూపాన్ని వర్ణించడానికి పర్యావరణం అనే పదాన్ని ఉపయోగిస్తారు.

● **ఎ.గౌడై:** తన గ్రంథం ద నేచర్ ఆఫ్ ద ఎన్విరాన్‌మెంట్‌లో భౌతిక పరిణామాలే పర్యావరణమని, దానిని ప్రభావితం చేసే వారిలో మానవుడు అతి ముఖ్యమైన వాడని చెప్పారు.

● **బోరింగ్:** ఈయన పిండోత్పత్తి నుంచి మృత్యువు వరకు వ్యక్తి పొందే భౌతిక స్పందనల సమ్మేళనమే పర్యావరణమని చెప్పారు.

ప్రపంచవ్యాప్తంగా పర్యావరణంపై అవగాహన కలిగించేందుకు 1974 నుంచి ఏటా జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించాలని ఐక్యరాజ్యసమితి నిర్ణయించింది.

పర్యావరణ అనుఘటకాలు

పర్యావరణం, జీవులు, నిర్జీవులు అనే రెండు ప్రాకృతికమైన అనుఘటకాలతో నిండి ఉంటుంది. పర్యావరణంలో రెండు అనుఘటకాలు ఉంటాయి. అవి-

ఎ) **జీవ అనుఘటకాలు:** వృక్షాలు, జంతువులు, సూక్ష్మజీవులు మొదలైనవి.

బి) **నిర్జీవ అనుఘటకాలు:** ఇవి మూడు రకాలు

1) **శీతోష్ణస్థితిపరమైనవి:** కాంతి, ఉష్ణం, వర్షపాతం మొదలైనవి.

2) **భౌతికపరమైనవి:** గాలి, నేల(మైదానాలు, పీఠభూములు, లోయలు మొదలైనవి), నీరు.

3) **రసాయనికపరమైనవి:** సేంద్రీయపరమైన కార్బోహైడ్రేట్స్ ప్రోటీన్స్, లిపిడ్స్, నిరింద్రీయ పరమైన సోడియం, పొటాషియం, కాల్షియం, పాస్ఫరస్ మొదలైనవి.

పర్యావరణం - వర్గీకరణ

దీనిని మూడు రకాలుగా వర్గీకరించవచ్చు.

1) మానవ నిర్మిత పర్యావరణం/ కృత్రిమ పర్యావరణం

2) సహజసిద్ధ పర్యావరణం

1) మానవ నిర్మిత పర్యావరణం: మానవ నిర్మిత పర్యావరణాన్ని సామాజిక - సాంస్కృతిక పర్యావరణం అంటారు. సహజంగా ఏర్పడినవి కాకుండా మానవుడు తయారు చేసిన లేదా నిర్మించిన ఆవరణాన్ని మానవ నిర్మిత పర్యావరణంగా చెప్పుకోవచ్చు. ఉదాహరణకు పంట పొలాలు, అక్వేరియాలు, పూల తోటలు, చేపల చెరువులు, విద్యాసంస్థలు, పార్కులు, వాణిజ్య సంస్థలు మొదలైన వాటిని మానవ నిర్మిత పర్యావరణంగా పరిగణించవచ్చు.

2) సహజసిద్ధ పర్యావరణం: సౌర మండలంలో ఏ గ్రహానికి లేని విశిష్ట లక్షణం భూ మండలానికి ఉంది. జీవరాశికి అనువైన వాతావరణం ఒక్క భూ మండలానికే ఉంది. మన చుట్టూ ఉండే గాలి, నీరు, వివిధ జీవరాశులు అంటే మానవులు, జంతువులు, వృక్షాలు, పక్షులు, క్రిమికీటకాలు, సూక్ష్మజీవులు మొదలైన వాటిని కలిపి సహజసిద్ధ పర్యావరణం అంటారు. మానవుని ప్రమేయం లేకుండా భూమిపై గల అనుకూల శీతోష్ణస్థితి ప్రభావాల కారణంగా ఏర్పడినదే 'సహజసిద్ధ పర్యావరణం' అంటారు.



పోటీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ జాగ్రఫీ

సహజసిద్ధ పర్యావరణాన్ని వాటి స్థితిని బట్టి నాలుగు రకాలుగా విభజించారు.

ఎ) వాతావరణం బి) జలావరణం

సి) శిలావరణం డి) జీవావరణం

ఎ) **వాతావరణం:** ఈ పదాన్ని గ్రీకు పదాలైన Atoms (vapour), Sphaira (Sphere) ఆవరణం నుంచి ఉద్భవించింది. గ్రీకుభాషలో అట్మాస్ అంటే గాలి/ఆవిరి అని అర్థం. ఈ ఆవరణాన్ని ఆంగ్లంలో అట్మాస్ఫియర్ అంటారు. భూమి పైభాగాన్ని కప్పి ఉన్న దుమ్ము, ధూళి, వాయువుల మిశ్రమాన్ని వాతావరణం అంటారు(లేదా) భూమిపై వ్యాపించి ఉన్న గాలి పొరను వాతావరణం అంటారు.

● భూమి చుట్టూ వాతావరణం లేకుంటే అంతరిక్షం నుంచి వెలువడే కాస్మిక్ కిరణాలు, సౌర కిరణాలు భూమిపై ప్రసరించి అన్ని గ్రహాల వలే ఒక ఉష్ణగోళంగా మారిపోయి, జీవరాశులకు ఆవాసం లేకుండా పోయేది. భూగోళం చుట్టూ వాతావరణం ఉండటం వల్ల జీవరాశి మనుగడకు అనుకూలమైన పరిస్థితులు ఏర్పడ్డాయి. కాబట్టి సహజంగా వాతావరణంలో ఉన్న ఆక్సిజన్, నైట్రోజన్, కార్బన్ డై ఆక్సైడ్, నీటి ఆవిరి మొదలైన వాటికి జీవ వైవిధ్యంలో కీలకపాత్ర ఉంది.

● వీటితోపాటు వాతావరణంలో దుమ్ము, ధూళి, లవణ కణాలు, సూక్ష్మ కణ రూపంలో ఉండి వాతావరణ ప్రక్రియల్లో ప్రాముఖ్యాన్ని సంతరించుకున్నాయి.

● వాతావరణం గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని మెటరాలజీ అంటారు.

● వాతావరణం మనల్ని వెచ్చగా ఉంచుతుంది. ఇది భూ ఉపరితల ఉష్ణోగ్రతలను నియంత్రిస్తుంది. తీవ్రమైన పగలు - రాత్రి ఉష్ణోగ్రత వ్యత్యాసాలను తగ్గిస్తుంది.

● గాలి, వర్షం, మంచు మొదలైన అంశాలు, వాతావరణంపైనే ఆధారపడతాయి. వర్షం, గాలులు లేకుంటే జీవుల మనుగడ కష్టమవుతుంది. ఈ విధులే కాకుండా వాతావరణం సూర్యుని నుంచి విడుదలయ్యే హానికర అతి నీలలోహిత కిరణాల వల్ల కలిగే నష్టాన్ని నివారించడంలో సహాయపడుతుంది.

● ప్రపంచ వాతావరణ దినోత్సవం మార్చి 23(1950 నుంచి మొదలు)

● **ప్రపంచ వాతావరణ దినోత్సవం 2021 థీమ్:** పర్యావరణ వ్యవస్థ పునరుద్ధరణ

● **ఉద్దేశం:** పర్యావరణ వ్యవస్థ పునరుద్ధరణకు చెట్లను చురుకుగా నాటడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించడం, పెరుగుతున్న కాలుష్య స్థాయిని తగ్గించడం.

వాతావరణం లక్షణాలు

● దీనికి రంగు, రుచి, వాసనలు ఉండవు. అయితే ఇది వాసనలను శబ్దాలను, ఒకచోట నుంచి మరో చోటకు మోసుకెళ్తుంది.

● ఇది పారదర్శకమైన లక్షణాన్ని కలిగి స్థితిస్థాపక శక్తిని కలిగి ఉంటుంది.

● భూమిని ఆవరించి ఉండటంతో సూర్యుని నుంచి వెలువడే హానికరమైన అతి నీలలోహిత కిరణాలను భూమిని చేరనీయకుండా జీవజాతిని రక్షిస్తుంది.

● వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులకు సంబంధించి వాతావరణంపై అధ్యయనం చేసేందుకు 1950 మార్చి 23న 180 దేశాల సభ్యత్వంతో ప్రపంచ వాతావరణ సంస్థను ప్రారంభించారు. ఈ సంస్థ ఏర్పడిన రోజును ప్రపంచ వాతావరణ దినోత్సవంగా నిర్ణయించారు. యూఎస్ఎస్ఓ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఈ దినోత్సవం జరుగుతుంది.



వి.వెంకట్‌రెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ

నవ్య | చిత్రజ్యోతి



చిరంజీవికి అక్కినేని అవార్డ్

మెగాస్టార్ చిరంజీవికి ఏయన్నార్ జాతీయ అవార్డ్ ఇవ్వనున్నట్లు హీరో నాగార్జున శుక్రవారం ప్రకటించారు. వచ్చే నెల 28న ఈ అవార్డ్‌ను ఆలిండియా మెగాస్టార్ అమితాబ్ చేతుల మీదుగా అందజేస్తామని ఆయన తెలిపారు. ఇకపై రెండేళ్లకు ఒకసారి ఈ అవార్డ్‌ను ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు. ఈ విషయం చెప్పగానే చిరంజీవి ఎమోషనల్ అయ్యారనీ, ఇంతకంటే పెద్ద అవార్డ్ లేదన్నారని నాగార్జున చెప్పారు.లుగు చిత్ర పరిశ్రమలోనే కాకుండా భారతీయ చలన చిత్ర పరిశ్రమకు విశేష సేవలు అందించిన చిత్ర ప్రముఖులకు తన పేరుతో జాతీయ అవార్డ్ ఇచ్చి సత్కరించాలని అక్కినేని తన పేరుతో జాతీయ అవార్డ్ ప్రారంభించి తొలిసారిగా 2006లో బాలీవుడ్ నటుడు దేవానంద్‌కు ఇచ్చారు. ఏటా క్రమం తప్పకుండా అవార్డులు ఇవ్వడానికి టి.సుబ్బరామిరెడ్డి అధ్యక్షుడిగా రూ.కోటి మూలధనంతో అక్కినేని ఇంటర్నేషనల్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశారు.

నవ్వుతూ జీవించడం నాన్న నేర్పించారు

నాగార్జున

మహానటుడు అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న 'కింగ్ ఆఫ్ ద సిల్వర్ స్ర్కీన్ ఫిల్మ్ ఫెస్టివల్'ను శుక్రవారం అభిమానులు, కుటుంబ సభ్యుల సమక్షంలో ప్రారంభించారు అక్కినేని నాగార్జున. హెరిటేజ్ ఫౌండేషన్, ఎన్.ఎఫ్.డీ.సి. నేషనల్ ఫిల్మ్ ఆర్కైవ్స్ సహకారంతో 31 నగరాల్లో ఈ ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నారు. 'దేవదాసు' చిత్రంతో ఫెస్టివల్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ 'నవ్వుతూ జీవించడాన్ని నాన్న మాకు నేర్పించారు. అందుకే ఆయన పేరు తలచుకుని నవ్వుతుంటాం. ఈ ఫెస్టివల్ నిర్వహిస్తున్న శివేంద్ర సింగ్ దుంగార్పూర్‌కు ధన్యవాదాలు. వాళ్లు సెలెక్ట్ చేసిన చిత్రాల ప్రింట్స్ చక్కని క్వాలిటీతో ఉన్నాయి. నార్త్‌లో ఈ ఫెస్టివల్‌కు మంచి స్పందన వస్తోందని శివేంద్ర చెప్పారు. నాన్నగారి శత జయంతి రోజున పోస్టల్ డిపార్ట్‌మెంట్ ప్రత్యేక స్టాంప్ విడుదల చేయడం ఆనందంగా ఉంది. అలాగే తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి నాన్నగారి సీనియర్ అభిమానులు హైదరాబాద్ వచ్చారు. వారికి కూడా దన్యవాదాలు' అని చెప్పారు. వెంకట్ అక్కినేని మాట్లాడుతూ 'నాన్నగారి శత జయంతి రోజున ప్రభుత్వం పోస్టల్ స్టాంప్ విడుదల చేసింది. బాపుగారు గీసిన ఫొటోతో స్టాంప్ రూపొందింది. ఈ రోజే స్టాంప్ రిలీజ్ అయ్యేలా ప్లాన్ చేసిన కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియాకు కృతజ్ఞతలు' అన్నారు. కేంద్రసమాచార శాఖ కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ 'నవంబర్‌లో గోవాలో నిర్వహించే అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్‌లో అక్కినేని చిత్రాలను ప్రదర్శిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అక్కినేని కుటుంబ సభ్యులతో పాటు పలువురు చిత్ర ప్రముఖులు పాల్గొన్నారు.





కె.బాలచందర్ స్త్రీలోలుడు


\- గాయని సుచిత్ర





తమిళ దర్శక శిఖరం కె.బాలచందర్ ఓ స్త్రీలోలుడు అని గాయని, నటి సుచిత్ర సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన జీవించివున్నంతకాలం కామవాంఛతో రగిలిపోయారంటూ ఇటీవల ఓ యూట్యూబ్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. కె.బాలచందర్ చనిపోయేంత వరకు ఒక 'లస్ట్‌మేన్'గా ఉన్నారు. మహిళలను తప్పుడు దృష్టికోణంలోనే చూశారు. వారిపట్ల అసభ్యంగా నడుచుకున్నారు. ఆయన గురించి అనేక మందికి తెలుసు. నన్ను కూడా కొందరు ఫామ్‌హౌస్‌లకు రమ్మని పిలిచారు. కానీ, నేను వెళ్లలేదు' అని చెప్పారు. ఆమె ఆరోపణలను తమిళ చిత్ర దర్శకుల సంఘం, దక్షిణ భారత సినీ రచయితల సంఘం తీవ్రంగా ఖండించాయి. తమిళ చిత్రపరిశ్రమకు ఎంతో మేలు చేసి, అనేక అవార్డులు అందుకుని, అనేకమంది యువ దర్శకులకు మార్గనిర్దేశం చేసిన కె.బాలచందర్‌ను ఉద్దేశించి సుచిత్ర చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్టు సౌత్ ఇండియన్ ఫిల్మ్ రైటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, సీనియర్ దర్శక నటుడు కె.భాగ్యరాజ్ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే, కోలీవుడ్ సినీ దర్శకుడు సంఘం అధ్యక్షుడు ఆర్.వి.ఉదయకుమార్ విడుదల చేసిన ప్రకటనలో, 'భౌతికంగా మన మధ్యలేని గొప్ప వ్యక్తి గురించి ఇలా మాట్లాడి, వారి కుటుంబ సభ్యులను మనోవేదనకు గురిచేయడం పట్ల విచారం వ్యక్తం చేస్తున్నాం' అని పేర్కొన్నారు.

\- చెన్నై (ఆంధ్రజ్యోతి)



మళ్లీ కెమెరా ముందుకు..

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న పవన్‌కల్యాణ్ గతంలో తాను అంగీకరించిన చిత్రాలను పూర్తి చేయాలని నిర్ణయించుకున్నారు. 'హరిహర వీరమల్లు' చిత్రం మొదటి భాగంలో మిగిలిన షూటింగ్ చేయడానికి సమయం కేటాయించారు. ఈ నెల 23 నుంచి విజయవాడలో ఈ సినిమా కొత్త షెడ్యూల్ మొదలవుతుంది. హాలీవుడ్ యాక్షన్ కొరియోగ్రాఫర్ నిక్ పావెల్ సారథ్యంలో భారీ యుద్ధ సన్నివేశం చిత్రీకరించనున్నట్లు నిర్మాత దయాకరరావు చెప్పారు. ఇంతకు మునుపెన్నడూ చూడని స్థాయిలో ఈ యుద్ధ సన్నివేశాలు చిత్రీకరించడానికి దర్శకుడు జ్యోతికృష్ణ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో బాలీవుడ్ నటులు బాబీ డియోల్, అనుపమ్ ఖేర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఏ.ఎం.రత్నం ఈ సినిమాకు సమర్పకుడు.

ఓటుకు నోటు కేసు బదిలీకి

సుప్రీం తిరస్కృతి!

▸▸ కేసు దర్యాప్తులో జోక్యం వద్దని రేవంత్‌కు ఆదేశం

▸▸ క్షమాపణలను అంగీకరించిన ధర్మాసనం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఓటుకు నోటు కేసును వేరే రాష్ట్రానికి బదిలీ చేయడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. స్పష్టమైన ఆధారాలు లేకుండా కేవలం ఊహాజనితమైన అంశాలతో పిటిషన్ వేశారని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ కేసులో పిటిషనర్లు ప్రాసిక్యూషన్‌పై పూర్తి విశ్వాసం వ్యక్తం చేసినందున ఈ కేసు విచారణను వేరే రాష్ట్రానికి బదిలీ చేయాల్సిన అవసరం లేదని అభిప్రాయపడింది. అలాగే సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో దర్యాప్తు చేయాలన్న పిటిషనర్ల అభ్యర్థనను తోసిపుచ్చింది. ఓటుకు నోటు కేసును మధ్యప్రదేశ్‌కు బదిలీ చేయాలని ఈ ఏడాది జనవరి 31న బీఆర్ఎస్ నేతలు జగదీశ్‌రెడ్డి, మహ్మద్ అలీ, సత్యవతి రాథోడ్, కల్వకుంట్ల సంజయ్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను సోమవారం జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. కేసు విచారణలో ఎటువంటి పరిస్థితుల్లోనూ జోక్యం చేసుకోవద్దని రేవంత్‌రెడ్డిని ఆదేశించింది. ఇక నుంచి కేసు విచారణను సీఎంకు నివేదించవద్దని ఏసీబీ డీజీని ఆదేశించింది. ప్రతివాది అయిన సీఎం రేవంత్‌రెడ్డి ఈ కేసు విచారణలో జోక్యం చేసుకుంటే మళ్లీ కోర్టును ఆశ్రయించే అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొంది. ఇదే సందర్భంలో ట్రయల్ కోర్టు కేసు విచారణను పారదర్శకంగా చేపట్టాలని ఆదేశించింది.

రేవంత్.. క్షమాపణలు స్వీకరిస్తున్నాం

ఢిల్లీ మద్యం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు సుప్రీంకోర్టు బెయిల్ ఇవ్వడంపై రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ గతంలో ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. శుక్రవారం కేసు విచారణ సందర్భంగా మరోసారి ఆ అంశం ప్రస్తావన వచ్చింది. రేవంత్‌రెడ్డి ఒకసారి సోషల్ మీడియా వేదికగా, మరోసారి బహిరంగంగా రెండుసార్లు సుప్రీంకోర్టుకు క్షమాపణలు చెప్పారని రోహత్గీ ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. రాజ్యాంగబద్ధ హోదాలో ఉన్న వ్యక్తులు జాగ్రత్తగా వ్యవహరించాలని కోర్టు మరోసారి హితవు పలికింది. ప్రజాస్వామ్యంలోని 3 కీలక వ్యవస్థలు తమ పరిధిలోని రాజ్యాంగ విధులను నిర్వర్తించాలని సూచించింది.

టిడ్కో సముదాయాలు ఇక 'ఎన్టీఆర్ నగర్'లు

అమరావతి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టిడ్కో ఇళ్ల కాలనీలకు ఇక నుంచి పీఎంఏవై-ఎన్టీఆర్ నగరాలుగా పేరు మార్చనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా టిడ్కో ఇళ్ల నిర్మాణాలను అప్పట్లో టీడీపీ ప్రభుత్వం నిర్మించింది. వైసీపీ సర్కార్ వచ్చిన తర్వాత వాటికి వైఎస్ఆర్ జగనన్న నగరాలుగా పేరు పెడుతూ అప్పట్లో మున్సిపల్‌శాఖ ఆదేశాలిచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తిరిగి ఈ కాలనీలకు ఎన్టీఆర్ నగర్‌లుగా మార్చారు.

చంచల్‌గూడ జైలుకు జానీ మాస్టర్

▸▸ రాజేంద్రనగర్ కోర్టులో హాజరుపరిచిన పోలీసులు

▸▸ దురుద్దేశంతోనే బాలికను అసిస్టెంట్‌గా చేర్చుకున్నాడు

▸▸ చేరిన నెలలోపే ముంబైకి తీసుకెళ్లి అత్యాచారం

▸▸ రిమాండ్ రిపోర్టులో వెల్లడి



పోలీసు వాహనంలో జానీ మాస్టర్

హైదరాబాద్ సిటీ/ రాజేంద్రనగర్/నార్సింగి, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): అత్యాచారం కేసులో అరెస్టయిన ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ అలియాస్ షేక్ జానీ బాషా(42)ను పోలీసులు చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఆయన్ను గోవా నుంచి నగరానికి తీసుకొచ్చిన సైబరాబాద్ ఎస్‌వోటీ, నార్సింగి పోలీసులు.. శుక్రవారం మధ్యాహ్నం ఒకటిన్నరకు రాజేంద్రనగర్ సర్కిల్ ఉప్పర్‌పల్లిలోని 13వ అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ముందు హాజరు పరిచారు. పోలీసులు సమర్పించిన ఆధారాలను పరిశీలించి, ఇరువర్గాల వాదనలూ విన్న న్యాయమూర్తి.. అక్టోబర్ 3 వరకు (14 రోజుల) రిమాండ్ విధించారు. అనంతరం జానీ మాస్టర్‌ను అత్తాపూర్ జాయ్ హాస్పిటల్ తీసుకెళ్లి అక్కడ వైద్య పరీక్షలు చేయించిన పోలీసులు.. చంచల్‌గూడ జైలుకు తరలించారు. కాగా.. రిమాండ్ రిపోర్టులో పోలీసులు విస్తుపోయే విషయాలు వెల్లడించారు. జానీమాస్టర్ దురుద్దేశంతోనే బాధితురాలిని అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌గా తీసుకున్నట్లు తెలిపారు. ఆమెకు ప్రముఖ డ్యాన్స్ షోలో పాల్గొనే అవకాశం రావడంతో 2017లో నగరానికి వచ్చిందని.. తర్వాత జానీ మాస్టర్ వద్ద అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌గా చేరిందని తెలిపారు. 2019, డిసెంబర్ 15 నుంచి జానీ మాస్టర్ వద్దే పనిచేస్తూ అల్కాపురికాలనీలో ఉంటోందని.. ఆ సమయంలో ఇద్దరూ ఒక సూపర్ హిట్ సినిమాకు పనిచేశారని పేర్కొన్నారు. ఆ సినిమా పని నిమిత్తం 2020 జనవరి 10న (అంటే చేరిన నెలరోజుల్లోపే) జానీ మాస్టర్, బాధితురాలు, మరో ఇద్దరు సహాయకులు ముంబై వెళ్లారని.. ఆ రోజు రాత్రి 12 గంటలకు బాధితురాలిని ఆధార్‌కార్డు, ఇతర డాక్యుమెంట్లు తీసుకొని తన గదికి రావాలని ఆదేశించిన మాస్టర్.. ఆమె గదిలోకి రాగానే గడియ పెట్టి అత్యాచారం చేశాడని.. అప్పటికీ బాలిక వయసు 16 ఏళ్లని తెలిపారు. అందుకే జానీమాస్టర్‌పై పోక్సో చట్టం కింద కూడా కేసు పెట్టినట్టు వెల్లడించారు. హోటల్ గదిలో జరిగినదాని గురించి ఎవరికైనా చెప్తే ఉద్యోగం నుంచి తొలగించడంతోపాటు పరిశ్రమలోనే లేకుండా చేస్తానంటూ బాధితురాలిని జానీమాస్టర్ బెదిరించినట్టు తెలిపారు. భయపడిన బాధితురాలు మిన్నకుండా ఉండిపోయిందన్నారు. చెప్పినట్టు వినకుంటే షూటింగ్ లొకేషన్‌లో అందరి ముందూ అసభ్యకరంగా మాట్లాడి అవమానించేవాడని.. మతం మార్చుకొని తనను పెళ్లి చేసుకోవాలంటూ ఆమెపై ఒత్తిడి కూడా తెచ్చేవాడని వెల్లడించారు. రోజురోజుకూ అతని వేధింపులు ఎక్కువ అవడంతో ఆమె సొంతగా పనిచేయడం ప్రారంభించిందని.. దీంతో ఒకరోజు జానీమాస్టర్, ఆయన భార్య ఆమె ఇంటికి వెళ్లారని, బాధితురాలి చెంపపై మాస్టర్ భార్య కొట్టారని.. కొంత మంది గుర్తుతెలియని వ్యక్తులు బాధితురాలిపై దాడికి యత్నించారని, ఏదో పార్సిల్ పంపి భయపెట్టాలని చూశారని పోలీసులు పేర్కొన్నారు. తనపై జరుగుతున్న అకృత్యాల గురించి బాధితురాలు.. జానీ మాస్టర్ వద్ద పనిచేస్తున్న మరో అసిస్టెంట్‌కు చెప్పుకొందని, అతని సూచన మేరకే పోలీసులకు ఫిర్యాదు చేసిందని తెలిపారు.

పీహెచ్‌సీ వైద్యులు విధుల్లో చేరాలి: కమిషనర్

అమరావతి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య సేవలు నిత్యావసర, అత్యవసరమైనవి అయినందున పీహెచ్‌సీ వైద్యులంతా వెంటనే విధుల్లో చేరాలని ఆరోగ్యశాఖ కమిషనర్ సి.హరికిరణ్ కోరారు. ఈ మేరకు పీహెచ్‌సీ వైద్యులకు, డా.యూనస్‌కు ఆయన లేఖ రాశారు. ఇన్‌సర్వీస్ రిజర్వేషన్‌కు సంబంధించి పీహెచ్‌సీ డాక్టర్లు తమ ఆందోళనలను తిరిగి ప్రారంభిస్తారంటూ పీహెచ్‌సీ వైద్యుల సంఘం అధ్యక్షుడు డా.యూనస్ మీర్ ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబుకు లేఖ అందించారు. దానిపై స్పందించిన ఆరోగ్య శాఖ కమిషనర్ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని విధుల్లో చేరాలని తిరిగి లేఖ రాశారు. పీహెచ్‌సీ వైద్యుల సంఘం అధ్యక్షుడు తన లేఖలో వాడిన భాష, ఆందోళన కార్యక్రమాల కొనసాగింపు ప్రతిపాదన ఈనెల 18న ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆధ్వర్యంలో జరిగిన చర్చల స్ఫూర్తికి విరుద్ధంగా ఉందన్నారు.

ఒకేరోజు 1.03కోట్ల పుస్తకాల పంపిణీ

అమరావతి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లోని విద్యార్థులకు రెండో సెమిస్టర్ పుస్తకాలను ఒకేరోజు పంపిణీ చేయాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. రెండో సెమిస్టర్‌కు సంబంధించిన 1.03కోట్ల పుస్తకాలను ఈనెల 30న పంపిణీ చేయనున్నారు. ఇప్పటికే మండల పాయింట్లకు పుస్తకాలు చేరుకున్నాయని, 28లోగా పాఠశాలలకు చేరుకుంటాయని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.వి జయరామరాజు తెలిపారు. 30న పంపిణీ ఈ ప్రక్రియను ఆర్జేడీలు, డీఈవోలు, ఎంఈవోలు పర్యవేక్షించాలని సూచించారు.

నాపై పరువు నష్టం కేసు కొట్టివేయండి

▸▸ హైకోర్టుకు జగన్... ఎల్లుండి విచారణ

అమరావతి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): విజయవాడ ఎంపీ, ఎమ్మెల్యేల ప్రత్యేక కోర్టులో మంత్రి నారాయణ తనపై వేసిన పరువు నష్టం కేసును కొట్టివేయాలని కోరుతూ మాజీ సీఎం జగన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం సోమవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ వద్ద విచారణకు రానుంది. రాజధాని భూముల వ్యవహారంలో తన పరువుకు భంగం కలిగించేలా వార్త ప్రచురించారని పేర్కొంటూ 2018లో మంత్రి నారాయణ, విజయవాడ ఎంపీ, ఎమ్మెల్యేల ప్రత్యేక కోర్టులో జగన్మోహన్‌రెడ్డి, తదితరులపై పరువు నష్టం కేసు వేశారు. ఈ కేసులో కోర్టు పలుసార్లు సమన్లు జారీ చేసినా జగన్ వాటిని అందుకోలేదు. పాస్‌పోర్టు పునరుద్ధరణ నిమిత్తం ఎన్‌వోసీ కోసం ఇటీవల ఆయన విజయవాడ కోర్టును ఆశ్రయించగా, ఎన్‌వోసీ జారీకి షరతులు విధించింది. ఈ ఉత్తర్వులను హైకోర్టు కూడా సమర్థించింది. పరువునష్టం కేసులో ప్రజాప్రతినిధుల కోర్టు జగన్‌కు తాజాగా సమన్లు ఇచ్చింది. విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది. దీంతో పరువు నష్టం కేసును కొట్టివేయాలని కోరుతూ జగన్ హైకోర్టును ఆశ్రయించారు.

విద్యార్థినులకు డైట్ చార్జీల పెంపు

కర్నూలు సిల్వర్ జూబ్లీ కళాశాల, కలికిరి, కంచికర్ల సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కాలేజీల్లోని విద్యార్థినులకు డైట్ చార్జీలు పెంచుతూ ఉన్నత విద్యాశాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. రూ.1,400 నుంచి రూ.1,600కు పెంచింది.

నా ఆరోపణలు అవాస్తవం

▸▸ ఎమ్మెల్యే ఆదిమూలంపై కేసులో హైకోర్టుకు బాధిత మహిళ వెల్లడి

▸▸ కేసు కొట్టేయాలంటూ అఫిడవిట్.. తీర్పును రిజర్వ్ చేసిన కోర్టు

▸▸ ఈ నెల 25న నిర్ణయం ప్రకటిస్తామని వెల్లడి

అమరావతి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై నమోదైన లైంగిక వేధింపుల కేసులో శుక్రవారం అనూహ్య పరిణామం చోటు చేసుకొంది. ఎమ్మెల్యే లైంగికంగా వేధించాడని కేసు పెట్టిన మహిళ స్వయంగా హైకోర్టు ముందు హాజరై పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తాను చేసిన ఆరోపణలు, ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న అంశాలు అన్నీ అవాస్తవమేనని న్యాయస్థానానికి నివేదించారు. ఈ మేరకు న్యాయవాదితో నోటరీ చేసిన అఫిడవిట్ దాఖలు చేశామని ఆమె తరఫు న్యాయవాది జితేందర్ కోర్టుకు దృష్టికి తీసుకొచ్చారు. న్యాయస్థానం సైతం ఫిర్యాదుదారును పిలిచి మాట్లాడగా వాస్తవాలను వివరిస్తూ అఫిడవిట్ వేశానని, ఆదిమూలంపై నమోదు చేసిన తప్పుడు కేసును కొట్టివేయాలని కోరారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ ఈ నెల 25న తగిన ఉత్తర్వులు జారీ చేస్తామని ప్రకటించారు. అప్పటివరకు ఆదిమూలంపై తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశించారు. సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తనపై పలుమార్లు లైంగికదాడి చేసి, అత్యాచారానికి పాల్పడ్డారంటూ సత్యవేడు నియోజకవర్గానికి చెందిన ఓ మహిళ ఈ నెల 5న ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా తిరుపతి తూర్పు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ టీడీపీ నుంచి సస్పెండ్ అయిన సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యం శుక్రవారం విచారణకు రాగా ఫిర్యాదుదారు నేరుగా కోర్టుకు హాజరయ్యారు. ఆదిమూలం తరఫున సీనియర్ న్యాయవాది సి.రఘు వాదనలు వినిపిస్తూ.... 'పిటిషనర్ ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆయనపై కేసు నమోదులో పోలీసులు చట్ట నిబంధనలు అనుసరించలేదు. మహిళా పోలీసు అధికారిణి కేసు నమోదు చేయాల్సి ఉండగా, పురుష అధికారి కేసు పెట్టారు. ఫిర్యాదు ఆధారంగా నమోదు చేసిన సెక్షన్లు పిటిషనర్‌కు వర్తించవు. జూలై, ఆగస్టు నెలల్లో ఘటన జరిగితే సెప్టెంబరు 5న ఫిర్యాదు చేశారు. మూడో వ్యక్తి చేసిన ఒత్తిడితోనే మహిళ కేసు పెట్టింది. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని కేసును కొట్టివేయాలి' అని కోరారు. బాధిత మహిళ తరఫున న్యాయవాది జితేందర్ వాదనలు వినిపిస్తూ.. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్న అంశాలు అన్నీ అవాస్తవమేనని బాధితురాలు కోర్టులో అఫిడవిట్ దాఖలు చేశారన్నారు. దానిని పరిగణనలోకి తీసుకొని కేసును కొట్టివేయాలని కోరారు.

ముందస్తు బెయిలు మంజూరు చేయండి

▸▸ హైకోర్టును ఆశ్రయించిన కాంతిరాణా తాతా

అమరావతి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ముంబయి సినీనటి కాదంబరి జెత్వానీ ఫిర్యాదు ఆధారంగా ఇబ్రహీంపట్నం పోలీసులు నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఐపీఎస్ అధికారి కాంతి రాణా తాతా హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం సోమవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ ముందు విచారణకు రానుంది. ఆ పిటిషన్‌లో... 'తన ఆధార్ కార్డు, ఇతర డాక్యుమెంట్లను ఫోర్జరీ చేశారని, తప్పుడు క్రిమినల్ కేసు పెట్టి పోలీసుల చేత అరెస్టు చేయించి వేధించాడని కుక్కల విద్యాసాగర్‌పై సినీనటి కాదంబరి జత్వాని ఇబ్రహీంపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో నిందితులుగా కుక్కల విద్యాసాగర్, ఇతరులని పేర్కొన్నారు. ఈ కేసులో పోలీసులు తనను అరెస్టు చేసే అవకాశం ఉంది. ఫిర్యాదులో నాపై నిర్దిష్టంగా ఎలాంటి ఆరోపణలు లేవు. జత్వానిపై కేసు, ఇంటిలో సోదాలు, అరెస్టు వ్యవహారంలో చట్ట నిబంధనల ప్రకారమే నడుచుకున్నాం. ఈ వ్యవహారంలో ప్రభుత్వం ఇప్పటికే నన్ను ఏకపక్షంగా సస్పెండ్ చేసింది. వ్యాజ్యం తేలేవరకు మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేయాలి' అని కాంతిరాణా తాతా కోరారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

దత్తిరాజేరు: గాయపడిన వ్యక్తి చికిత్సపొందుతూ శుక్రవారం మృతిచెందాడు. పెదమానాపురం ఎస్ఐ ఆర్.జయంతి కథనం మేరకు.. మొరకముడిదాం గ్రామానికి చెందిన జడ అప్పారావు ద్విచక్రవాహనంపై గజపతినరం వైపు గురువారం వెళ్తున్నాడు. అదే సమయంలో కోమటిపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి.దీంతో పోలీసులు 108 వాహనంలో గజపతినగరం సీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితిలో విషమించడంతో విజయనగరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్సపొందుతూ అప్పారావు మృతిచెందాడు.

భార్యాభర్తలకు గాయాలు

బొబ్బిలి రూరల్: మండలంలోని అలజంగిసమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. బొబ్బిలిలోని అంట్యాకులవీధికి చెందిన లోకురెడ్డి వెంకటరమణ మూర్తి, లక్ష్మి సదరం కోసం రాజాం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి తిరిగి వస్తున్నారు. ఆ సమయంలో అలజంగి సమీపంలో గోతుల్లో లారీ దిగడంతో పక్కకు ఒరిగింది. లారీ తమపై పడిపోతాదేమోనని భయంతో ద్విచక్రవాహనం సడన్ బ్రేక్ వేయడంతో రోడ్డుపై ఇద్దరు పడిపోయి గాయపడ్డారు. అదే సమయంలో తెర్లాం మండలం పర్యటనకు వెళ్లిన ఎమ్మెల్యే బేబీనాయన అటుగా కారులో వస్తుండగా రోడ్డుపై పడిపోయిన ఇద్దరినిచూసితన కారులో ఎక్కించుకుని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

రామభద్రపురం: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్‌చేసి డ్రైవర్‌పై కేసు నమోదుచేసినట్టు ఎస్ఐ వి.ప్రసాదరావు తెలిపారు. మండలంలోని పాడివానివలస జంక్షన్ వద్ద కోటశిర్లాం ఏడొంపులగెడ్డ నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న పాతరేగకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ జి.భాస్కరరావును అదుపులోకి తీసుకొని ట్రాక్టర్‌ను సీజ్ చేశామని చెప్పారు.

●**బొబ్బిలి రూరల్:** వేగావతి నది నుంచి ఇసుక తరలిస్తున్నారని పోలీసులకు అందిన సమాచారం మేరకు సిబ్బంది మెట్టవలస క్వారీ సమీపంలో గురువారం ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. తహసీల్దార్‌కు విషయం తెలియజేయగా గతంలోఇచ్చిన ఆదేశాలమేరకు ఆయన మొదటిసారిగా దొరికిన ట్రాక్టర్‌కు రూ.10వేలు చొప్పున జరిమానా విధించారు. మరోసారి దొరికితే ట్రాక్టర్ రిజిస్ట్రేషన్, డ్రైవర్ డ్రైవింగ్ లైసెన్స్ రద్దుచేస్తామని తహసీల్దార్ ఎం.శ్రీను తెలిపారు.

ఇసుక తరలింపుపై వివాదం




రోడ్డుపై బైఠాయించి ట్రాక్టర్‌ను అడ్డుకున్న రైతులు

శృంగవరపుకోట రూరల్: మండలంలోని సంతగౌరమ్మపేట వద్ద శుక్రవారం రాత్రి ఇసుక తరలింపుపై వివాదంనెలకొంది. మూడు ట్రాక్టర్లతో తరలిస్తున్న ఇసుకను ఎస్.కోట, సీతమ్మపేట గ్రామాలకు చెందిన రైతులు అడ్డుకున్నారు. దీంతో రెండు ట్రాక్టర్ల డ్రైవర్లు వేగం పెంచి, బెదిరించి వెళ్లిపోయారు. వేపాడ మండలంలోని బొద్దాం గ్రామానికి చెందిన ఓ ట్రాక్టరు పట్టుబడింది. పోలీసులకు ఎస్.కోట, సీతమ్మపేట గ్రామస్థులు సమాచారం ఇచ్చారు. దీంతో సంఘటన స్థలానికి సీఐ నారాయణమూర్తి చేసుకుని ట్రాక్టరును ఎస్.కోట పోలీసుస్టేషన్‌కు తరలించారు.ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తాము నాటు బండ్లతో ఇసుక తీసుకువస్తుంటే మామాడిపల్లి, దేవులాపల్లి గ్రామాలకు చెందిన కొందరు అడ్డుకుంటున్నారని, వారే ఇక్కడ ఇసుకను ట్రాక్టర్లకు అమ్ముకుంటున్నారని తెలిపారు.దీంతో తాము అడ్డుకున్నట్లు చెప్పారు.

కోటగండ్రేడులో పూరి గుడిసె దగ్ధం

గుర్ల: మండలంలోని కోటగండ్రేడులో శుక్రవారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో పూరిగుడిసె దగ్ధమయ్యింది.గ్రామానికి చెందిన మరడాన సూర్యనారాయణకు చెందిన గుడిసెలో నిప్పురవ్వలు చెలరేగడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దీంతో కట్టుబట్టలతోపాటు మొత్తం అగ్నికి ఆహుతవ్వడంతో కుటుంబ సభ్యులు లబోదిబోమంటున్నారు. ఈమేరకు గ్రామ కార్యదర్శి, వీఆర్వోలు పరామర్శించి ఆస్తి నష్టంఅంచనా వేశారు.

అనుమానాస్పద వ్యక్తులపై నిఘా: ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ వకూల్ జిందాల్

విజయనగరం క్రైం: జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లల్లో అనుమానాస్పదవ్యక్తులపై ప్రత్యేక నిఘాపెట్టాలని, వారి వెలిముద్రలను, మొబైల్ వేలి ముద్రల యాప్‌తో తనిఖీ చేయాలని ఎస్పీ వకూల్ జిందాల్ పోలీస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో మాసాంతర నేరసమీక్షా సమావేశాన్ని పోలీసు అధికారులతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రతిఒక్కరూ నీట్ యూనిఫాం ధరించి లాఠి వెంటతీసుకుని వెళ్లాలన్నారు. రాత్రీ గస్తీని మరింత ముమ్మరం చేయాలని కోరారు. పోలీసు అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా గ్రామసందర్శన చేయాలని తెలిపారు. దీపావళి, దసరా నేపథ్యంలో అక్రమంగా బాణసంచా తయారీ, విక్రయ దారులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇటీవల ముగిసిన లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులను డిస్పోజ్ చేసిన, విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన అధికారులను అభినందించి, ప్రసంశాపత్రాలు అందచేశారు. సమావేశంలో డీఎస్పీలు ఎం.శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు, వీరకుమార్, యూనివర్స్ న్యాయ సలహాదారుడు పరుశురాముతోపాటు పసీఐలు, ఎస్ఐలు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో మైఖెల్ ఫారడే జయంతి

విజయనగరం టౌన్: జేఎన్‌టీయూ జీవీ విశ్వవిద్యాలయంలో ప్రముఖ శాస్త్రవేత్త మైఖెల్ ఫారడే జయంతి శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు అంశాలపై ప్రజెంటేషన్లు ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ రాజేశ్వరరావు, ఈఈఈ ప్రొఫెసర్ శ్రీకుమార్, వైస్ ప్రిన్సిపాల్ జీజే నాగరాజు, ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ ఎ.పద్మజ, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్లు పి.శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

అటవీ భూములను ఆక్రమిస్తే చర్యలు: డీఆర్వో

బొబ్బిలి రూరల్: అటవీభూములను ఆక్రమించి సాగుచేస్తే కఠిన చర్యలు తప్పవని డీఆర్వో జమ్మాన సుధీర్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం కృష్ణాపురంలో విలేకరులతో మాట్లాడుతూ గోపాలరాయుడుపేట పంచాయతీ పరిధి సమీపప్రాంతాల్లో వందలాది ఎకరాల అటవీభూములను ఇతర ప్రాంతాలనుంచి వచ్చి ఆక్రమించుకుని సాగు చేస్తున్నారని తెలిపారు. దీంతో వందలాది ఎకరాల్లో అటవీసంపద నాశనమయ్యిందని చెప్పారు.ప్రస్తుతం గోపాలరాయుడుపేట పంచాయితీలో అటవీ భూముల్లో 12 వేల మొక్కలు, షికారుగంజి ప్రాంతంలో సుమారు 25 వేల మొక్కలు నాటుతున్నామని తెలిపారు.

రిజిస్ట్రేషన్, స్టాంపులశాఖ డీఐజీగా నాగలక్ష్మి

విజయనగరం దాసన్నపేట: రిజిస్ట్రేషన్, స్టాంపులశాఖ డీఐజీగా ఎ.నాగలక్ష్మి గురువారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ నుంచి ఇక్క డకు బదిలీపై వచ్చారు. గతంలో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో రిజిస్ట్రార్‌గా పని చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లోని రిజిస్ట్రేషన్‌కార్యాలయాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా కృషి చేస్తానని తెలిపారు. ప్రజలతో రిజిస్ట్రార్‌లు మమేకమై సేవలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, వాటిని పక్కాగా అమలు చేస్తామని చెప్పారు.

ఎస్సీ వర్గీకరణకు కృషి చేయాలి

బొబ్బిలి రూరల్: ఎస్సీ వర్గీకరణ అమలును వేగవంతం చేయడానికి కృషి చేయాలని ఏపీ ఎంఈఎఫ్ అధ్యక్షులు దేవరపల్లి భిక్షాలు కోరారు.ఈ మేరకు శుక్రవారం, బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయనను కలిసి వినతిపత్రం అందజేశారు.

గెడ్డను కప్పి.. రహదారి వేసి

- ఆనవాళ్లు లేకుండా చేసిన రియల్‌ఎస్టేట్ వ్యాపారులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న అలమండవానిపాలెం గ్రామస్థులు



రహదారిగా మారిన అలమండ గెడ్డ

జామి: మండలంలోని జాగరం పంచాయతీ పరిధిలో గల అలమండ గెడ్డను రియల్‌ఎస్టేట్ వ్యాపారులు కప్పేశారు. ఏకంగా వీరు కొనుగోలుచేసిన భూములకు గెడ్డ అడ్డురావడంతో దాని ఆనవాళ్లు లేకుండా చేయడం విశేషం. ఈ విషయంపై రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తుండడంపై అలమండవానిపాలెం యువకులు, గ్రామస్థులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

జాగరం రెవెన్యూ పరిధిలో గల అలమండవానిపాలెం అలమండ గెడ్డను ఆనుకొని ఉన్న భూములు ధర తక్కువగా ఉండడంతో కొంతమంది రియల్‌ఎస్టేట్ వ్యాపారుల కన్ను పడింది. వైసీపీ ప్రభుత్వహయాంలో కొందరు నాయకులు ఆధ్వర్యంలో ఈ గెడ్డకు ఆనుకొని ఉన్న భూములను కారుచౌకగా కొట్టేశారు. అయితే వీటికి రోడ్డు ప్రధాన సమస్యగా మారింది. రోడ్డు వేయకపోతే తాము కొనుగోలు చేసిన భూములకు విలువ పెరగదని భావించారు. దీంతో వెంటనే వీరి కన్ను అలమండ గెడ్డపై పడింది. ఈ నేపథ్యంలో గెడ్డను క్రమక్రమంగా కప్పేయడం మొదలుపెట్టారు. ఎవరూ ప్రశ్నించే ధైర్యం చేయలేకపోవడంతో ఏకంగా గెడ్డను కప్పి తమ భూముల్లోకి దారి వేసేశారు. ఈ గెడ్డ కప్పేయడం విషయం సచివాలయం, రెవెన్యూ అధికారులకు తెలియకపోవడంపై కొంతమంది రైతులు, అలమండ వానిపాలెం యువకులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

తన దృష్టికి ఈ విషయం రాలేదని, పరిశీలిస్తానని వీఆర్వో నారాయణరావు తెలిపారు. వెంటనే సిబ్బందిని పంపించి పరిశీలిస్తామని, ఆక్రమణలు జరిగితే గుర్తించి సంబంధిత వ్యక్తులపై చర్యలు చేపడతామని తహసీల్దార్ కృష్ణలత చెప్పారు.



శృంగవరపుకోట: పుణ్యగిరిలో రూ.2.18 లక్షల చెక్కును అందజేస్తున్న కొత్తవలస వాగ్దేవి విద్యాసంస్థల యాజమాన్య ప్రతినిధులు



రాజాం రూరల్: ఎమ్మెల్యే మురళీమోహన్‌కు విరాళం అందజేస్తున్న జర్నలిస్టులు



విజయనగరం టౌన్: ఎమ్మెల్యే అదితి గజపతిరాజుకు చెక్కును అందజేస్తున్న టీడీపీ నాయకులు

వరద బాధితులకు విరాళాలు



తెర్లాం: ఎమ్మెల్యే బేబీనాయనకు లక్ష విరాళాన్ని అందజేస్తున్న టీడీపీ నాయకులు

విజయవాడ వరద బాధితులకు పలు సంస్థలు, సంఘాలు, వ్యక్తిగతంగా ఆదుకోవడానికి ముందుకొస్తున్నారు. ఈ మేరకు సేకరించిన విరాళాలు ముఖ్యమంత్రి సహాయ నిధిలో జమచేయాలని ఎమ్మెల్యేలు, ఎంపీలు, కలెక్టర్‌కు శుక్రవారం అందజేశారు. ప్రధానంగా విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి విరాళాలు సేకరించి అధికారులకు అందజేస్తున్నారు.

-ఆంధ్రజ్యోతి బృందం



కలెక్టరేట్: కలెక్టరుకు చెక్కును అందజేస్తున్న విద్యార్థులు

సమస్యల పరిష్కారానికే 'గ్రామసందర్శన'

సమస్యలు పరిష్కరించేందుకే గ్రామసందర్శన కార్యక్రమం నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. శుక్రవారం జిల్లాలోని పలు గ్రామాల్లో గ్రామసందర్శన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, చెత్తసంపద కేంద్రాలు పరిశీలించారు.

●**రేగిడి:** మండలంలో సంకిలిలో శుక్రవారం గ్రామసందర్శన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామస్థులు ఎంపీడీవో శ్యామలాకుమారి, తహసీల్దార్ ఎల్లారావు దృష్టికి సమస్యలు తీసుకువెళ్లారు. కార్య క్రమంలో మండలపరిషత్ ప్రత్యేకాధికారి, డీఆర్‌డీఏ పీడీ కళ్యాణచక్రవర్తి, ఈవోపీఆర్డీ సత్యనారాయణ, సర్పంచ్ పట్టాభి, కార్యదర్శి శైలజ పాల్గొన్నారు.

●**రాజాం రూరల్:** అమ్మ పేరుతో ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలని రాజాం నోడల్ అధికారి నిర్మలాకుమారి, ఎంపీడీవో వావిలపల్లి శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని బొద్దాంలో గ్రామ సందర్శన కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల, సచివాలయాలను పరిశీలించారు. ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ ప్రాంగణంలో మొక్కలునాటారు. ఇది మంచి ప్రభుత్వం బ్రోచర్లను పంపిణీ చేశారు.

●**తెర్లాం:** మండలంలోని ఉద్దవోలులో స్పెషలాఫీసర్ రామారావు ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామ సందర్శన కార్యక్రమంలో ఎమ్మెల్యే బేబీనాయన అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. గర్భిణులకు సామూహిక సీమంతాల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.రామకృష్ణ పాల్గొన్నారు.

●**బొబ్బిలి రూరల్:** మండలంలోని కృష్ణాపురంలో గ్రామ సందర్శనలో భాగంగా ఎంపీయూపీ పాఠశాలను శుక్రవారం ఎంఈవో సీహెచ్ లక్ష్మణరావుతో కలిసి జిల్లా నోడల్ అధికారి మధుసూధనరావు తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవికుమార్, సర్పంచ్ చోడవరపు సూర్యనారాయణ, ప్రధానోపాధ్యాయులు ఎంఎస్ఆర్ నాయుడు,రామారావు పాల్గొన్నారు.



రేగిడి: సంకిలిలో అంగన్‌వాడీకేంద్రం తనిఖీచేస్తున్న, శ్యామలాకుమారి

●**వేపాడ :** పంచాయతీలు అభివృద్ధి సాధిస్తేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మండల నోడల్ అధికారి లక్ష్మీనారాయణ తెలిపారు. జాకేరులో గ్రామ సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్య క్రమంలో ఎంపీడీఓ పట్నాయక్, తహసీల్దార్ సన్యాసినాయుడు పాల్గొన్నారు.

నేడు ఆకులకట్టలో 'మంచి ప్రభుత్వం'

బాడంగి: మండలంలోని ఆకులకట్టలో శనివారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే బేబీనాయన పాల్గొనున్నట్టు టీడీపీ మండలాధ్యక్షులు తెంటు రవిబాబు తెలిపారు.ఈసందర్భంగా వందరోజుల్లో చేపట్టినఅభివృద్ధిపనులపై వివరించనున్నారని పేర్కొన్నారు.

27న తపాలా పెన్షన్ అదాలత్

విజయనగరం రింగురోడ్డు: విజయనగరం పోస్టల్ డివిజన్ పరిధిలో వినియోగదారుల వ్యక్తిగత ఫిర్యాదులు సమస్యలు పరిష్కరించడానికి ఈనెల 27న తపాలాపెన్షన్ అదాలత్‌ని నిర్వహించనున్నట్లు తపాలా శాఖ సూపరిటెండెంట్ జి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. తపాలా పెన్షన్ అదాలత్‌కు సంబంధించిన సమస్యలు, వ్యక్తిగత ఫిర్యాదులను ఈనెల 26లోగా సూపరిటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసు, విజయనగరం డివిజన్, పిన్ నెంబరు 535002 అన్న చిరునామాకు పంపించాలని కోరారు. గడువు తేదీ తరువాత వచ్చే ఫిర్యాదులు స్వీకరించబోమని తెలిపారు.

28న భగత్‌సింగ్ జయంతి

బొబ్బిలి: తిరుపతి వెంకటేశ్వర యూనివర్శిటీలో ఈనెల 28న భగత్‌సింగ్ జయంతి నిర్వహించనున్నట్లు ఏపీ విద్యార్థి జేఏసీ ఉత్తరాంధ్ర కన్వీనర్ బి. సాయికిరణ్‌యాదవ్ తెలిపారు. శుక్రవారం బొబ్బిలి ఫూల్‌బాగ్ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో విద్యావేత్తలు చింతా అప్పారావు, మరిపి వేణుగోపాలరావులు, విద్యార్థి జేఏసీ జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వేపాడలో ఎస్‌జీఎఫ్ గేమ్స్

వేపాడ: వేపాడ జడ్పీపాఠశాలలో శుక్రవారం ఎస్‌జీఎఫ్ గేమ్స్ జడ్పీ టీసీ సభ్యుడు శానాపతి అప్పారావు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ మెలిపాక అర్జునమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు శానాపతి లక్ష్మి , ఎంఈవో జగదీశ్వరరావు, బాలభాస్కరరావు పాల్గొన్నారు.

స్కూల్‌బ్యాగుల వితరణ

బొబ్బిలి: స్థానిక హేండ్ ఇన్ హేండ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న అనాథాశ్రమంలో విద్యార్థులకు స్కూల్‌బ్యాగ్స్‌ను ఎమ్మెల్యే బేబీనాయన వితరణగా ఇచ్చారు. వీటిని పట్టణ టీడీపీ అధ్యక్షుడు రాంబార్కి శరత్‌బాబు, ఆశ్రమ వ్యవస్థాపకులు, జర్మనీకి చెందిన ప్రముఖ సామాజిక సేవా కార్యకర్త హెల్మర్‌జంగ్ చేతుల మీదుగా శుక్రవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సతీష్, తెంటు వెంకటేష్, సాగర్, సంతు పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్‌ను వినియోగించుకోవాలి

● *టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు అశోక్ గజపతిరాజు*



మాట్లాడుతున్న అశోక్ గజపతిరాజు

విజయనగరం టౌన్: ప్రతి ఒక్కరూ సోలార్ విద్యుత్‌ను వినియోగించుకోవాలని కేంద్ర మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు అశోక్ గజపతిరాజు పిలుపునిచ్చారు. విజయనగరం మండలంలోని జొన్నవలసలో శుక్రవారం ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన కార్యక్రమంలో మాట్లాడుతూ పథకంలో భాగంగా సోలార్ రూఫ్ టాప్స్ ఏర్పాటు చేసుకున్న వారికి ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని తెలిపారు. గృహ వినియోగదారులు సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుతో విద్యుత్ బిల్లులు ఆదా చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, ఎంపీటీసీ సభ్యులు రాజేష్‌బాబు పాల్గొన్నారు.

ప్రజలు మెచ్చేలా పాలన

విజయనగరం దాసన్నపేట: రాష్ట్రంలో ప్రజలు మెచ్చేలా కూటమి ప్రభుత్వ పాలన సాగుతోందని జనసేన నాయకుడు గురాన అయ్యలు తెలిపారు. గురువారం విజయనగరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్‌డీఏ కూటమి వంద రోజుల్లో పలు హామీలు అమలు చేసిందన్నారు. ప్రజలకు ప్రభుత్వం నమ్మకం కలిగించిందన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

విజయనగరం దాసన్నపేట: విజయనగరంలో బీసీ కాలనీలో గల ఎస్టీ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని పీడీఎస్‌వో జిల్లా అధ్యక్షుడు కె.సోమేష్ ఒక ప్రకటనలో కోరారు. జూలై 29న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో టీడీఎస్‌ఓ ఆధ్వర్యంలో డ్రైనేజీ వాటర్ సమస్యపై ఫిర్యాదు చేసినా పరిష్కారం కాలేదని తెలిపారు. అధికారుల నిర్లక్ష్య వైఖరి వల్ల హాస్టల్ విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

ఎయిర్‌పోర్టుకు అల్లూరి పేరు పెట్టడంపై హర్షం

విజయనగరం రింగురోడ్డు: భోగాపురం ఎయిర్‌పోర్టుకు మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టడంపై క్షత్రియ పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు పెనుమత్స సీతారామరాజు, సాగిసీతరామరాజులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం విజయనగరంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు భోగాపురం అంతర్జాతీయ ఎయిర్‌పోర్టుకు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టిముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట నిలబెట్టుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో ప్రతినిధులు లక్ష్మీపతివర్మ, కన్వీనర్ కేఆర్‌కే రాజు, జీఎస్ఎన్ రాజు పాల్గొన్నారు.

చెత్త సంపద తయారీ కేంద్రం పరిశీలన

బొబ్బిలి రూరల్:మండలంలోని పెంటలోగల చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని జిల్లా నోడల్ అధికారి కె.మధుసూదనరావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్త సంపద కేంద్రాల ద్వారా వచ్చే ఆదాయాన్ని గ్రామాభివృద్ధికి వినియోగించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.రవికుమార్, సర్పంచ్ అప్పలనాయుడు, సెక్రటరీ రవీంద్రకుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగన్నాథపురంలో ప్రకృతి వ్యవసాయం..

బొబ్బిలి రూరల్: జగన్నాథపురంలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయాన్ని స్టేట్ అధికారి కృష్ణారావు, డీపీఎం అనందరావు, బొబ్బిలి ఏడీఏ ఎం.శ్యామ్‌సుందర్ సందర్శించారు. వ్యవసాయం చేస్తున్న పొలాల గట్లపైన పండించిన కూరగాయలను, కంది మొక్కలు, అరటి తదితర పండ్ల మొక్కలను పరిశీలించి వాటిపైన వచ్చిన ఆదాయాలను గూర్చి రైతులతో మాట్లాడి తెలుసుకున్నారు.

సంక్షేమ పాలనపై అవగాహన

రింగురోడ్డు: సంక్షోభంలోనూ ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. ఒకటో డివిజన్ సాకేటి వీధిలో వందరోజుల సంక్షేమ పాలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో రెండుచోట్ల అన్నకాంటీన్లు పునఃప్రారంభించామని, త్వరలో ఘోషా ఆసుపతి వద్ద మరో అన్నక్యాంటీన్ ప్రారంభించనున్నట్లు తెలిపారు.

ఎస్.కోటను విశాఖలో కలిపేందుకు కట్టుబడి ఉన్నాం: ఎంపీ

శృంగవరపుకోట: శృంగవరపుకోట నియోజకవర్గాన్ని విశాఖ జిల్లాలో కలిపేందుకు కట్టుబడి ఉన్నామని, తొలి ఏడాదిలోనే ఈ హామీ పూర్తిచేస్తామని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ తెల్చిచెప్పారు. శుక్రవారం శృంగవరపుకోట పుణ్యగిరిలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారితో కలిసి ప్రారంభించారు. అనంతరం స్థానికులతో సమావేశమయ్యారు. లలితకుమారి మాట్లాడుతూ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సండిసోమేశ్వరరావు, వైస్‌ఎంపీపీ ఇందుకూరి సుధారాజు, సర్పంచ్ గనివాడ సంతోషి కుమారి, చంద్రశేఖర్, జీఎస్ నాయుడు పాల్గొరు.

●**తెర్లాం:** మండలంలోని ఉద్దవోలులో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన ప్రభుత్వం వందరోజుల పాలన గురించి వివరించారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర కార్యని ర్వాహక కార్యదర్శి బాబు పాలూరు, టీడీపీ మండలాధ్యక్షులు నర్సుపల్లి వెంకటనాయుడు, తేజోవతి, నర్సుపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

● **రాజాం రూరల్:** మండలంలోని వీఆర్ అగ్రహారంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు విజనరీనేతని, వంద రోజుల కూటమి పాలన చారిత్రాత్మకమని తెలిపారు. కార్యక్రమంలో మండల నోడల్‌అధికారి నిర్మలాకుమారి, తహసీల్దార్ కృష్ణంరాజు, ఎంపీడీవో వావిలపల్లి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు గురవాన నారాయణరావు,శ్రీనివాసరావు, చింత చంద్రినాయుడు, శ్రీరాములు, రమణ, పొట్నూరు లక్ష్మణ, కన్నంనాయుడు, రఘు మండల గణపతి పాల్గొన్నారు.

రేపు అవనాపు విక్రమ్, భావన జనసేనలో చేరిక

విజయనగరం (ఆంధ్రజ్యోతి): విజయవాడలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సమక్షంలో జనసేనలో ఆదివారం చేరుతున్నట్లు వైసీపీ నాయకుడు అవనాపు విక్రమ్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ భావన తెలిపారు. తమతో పాటు సాలూరు నియోజకవర్గానికి చెందిన సీనియర్ నేత జర్జాపు ఈశ్వరరావు, మునిసిపల్ వైస్‌చైర్మన్ జర్జాపు దీప్తి, సాలూరు మునిసిపల్‌కు చెందిన మరో ఏడుగురు కౌన్సిలర్లు పార్టీలో చేరుతున్నట్లు చెప్పారు. శుక్రవారం విజయనగరంలో విలేకరులతో మాట్లాడుతూ 2019లో పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నగరానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి వల్ల అవమానాలు, కేసులు కూడా ఎదుర్కొన్నామని అందుకే వైసీపీని వీడుతున్నట్లు తెలిపారు.పార్టీ అధికారంలో ఉన్నప్పుడు నగరంలోని ఓ ప్రజాప్రతినిధి ఆగడాలు ఎక్కువయ్యాయని, కష్టపడిన కార్యకర్తలకు న్యాయం చేయకుండా తన వారికే పదవులు, కాంట్రాక్టులు ఇప్పించుకున్నారని, దీంతో ఆయన వైఖరిపై చాలామంది కార్యకర్తలు విసిగిపోయారన్నారు. ఇదే విషయాన్ని జిల్లా, రాష్ట్ర నాయకత్వానికి తెలిపిన పట్టించుకోలేదన్నారు. సమావేశంలో కాళ్ల గౌరిశంకర్ పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

● కల్వర్టు గోడని ఢీకొన్న పాఠశాల బస్సు


విరిగిన బస్సు ముందు భాగం

కొమరాడ: పార్వతీపురంలోని ఓ ప్రైవేటు పాఠశాల నుంచి విద్యార్థులను తీసుకుని వస్తున్న బస్సు కొమరాడ మండలంలోని డంగభద్ర సమీపంలో అదుపు తప్పి కల్వర్టు గోడను ఢీకొంది. ఈ ఘటనలో ఎవరికి ఎటు వంటి ప్రమాదం జరగనప్పటికీ విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. శుక్రవారం సాయంత్రం రాజ్యలక్ష్మీపురం గ్రామం వైపు వస్తున్న బస్సు. డంగభద్ర సమీపంలోకి వచ్చేసరికి ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పి జంఝావతి ఎగువ కాలువపై ఉన్న కల్వర్టు గోడను ఢీకొంది. గోడను బలంగా ఢీకొట్టి ఉంటే బస్సు కాలువలోకి పడిపోయే అవకాశం ఉంది. విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు కొమరాడ ఎస్‌ఐ నీలకంఠం ఘటనా స్థలానికి చేరుకున్నారు. విద్యార్థులంతా క్షేమంగా ఉండడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఎస్‌ఐ దగ్గరుండి వారందరినీ వారి స్వగృహాలకు తరలించే ఏర్పాట్లు చేశారు.

పోలీసుల సమస్యల పరిష్కారానికి కృషి: ఎస్పీ


సిబ్బంది సమస్యలు వింటున్న ఎస్పీ

బెలగాం: పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఆయన పోలీస్ గ్రీవెన్స్ డే నిర్వహించారు. పోలీసు సిబ్బంది సమస్యలు నేరుగా విని పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని ప్రజా భద్రత కోసం నిరంతరం పని చేస్తున్న పోలీసుల సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా సిద్ధంగా ఉంటామని చెప్పారు. వివిధ హోదాల్లో పని చేస్తున్న పోలీస్ సిబ్బంది, అధికారుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు.

ఖైదీలకు అన్ని వసతులు కల్పించాలి


రికార్డులు పరిశీలిస్తున్న మోహన్‌రావు

పాలకొండ: సబ్‌జైలులో ఉన్న రిమాండ్ ఖైదీలకు అన్ని వసతులు కల్పించాలని జిల్లా జైళ్లశాఖ అధికారి కె.మోహన్‌రావు సూచించారు. సబ్‌జైలును ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. రిమాండ్ ఖైదీలతో మాట్లాడి, వారికి అందుతున్న వసతులపై ఆరా తీశారు. జైలు సూపరింటెండెంట్ బి.జోగులుతో మాట్లాడుతూ రిమాండ్ ఖైదీలకు సీజనల్ వ్యాధులు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వారికి అందిస్తున్న ఆహారంతో పాటు తాగునీరు వేడిగా ఉండాలని సూచించారు. జైల్లో ఉన్న ఖైదీలకు ఆరోగ్య పరీక్షలు వారం వారం నిర్వహించారు. అనంతరం జైలు పరిసరాలు, రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జైలు హెడ్ వార్డర్స్ పి.చంద్రరావు, బి.విజయ్‌కుమార్, పి.మధు, వార్డర్స్ నరసింహ, లీగల్ కో-ఆర్డినేటర్ ఎంవీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బాలికల్లో రక్తహీనత నివారణకు కృషి చేయాలి

● డిప్యూటీ డీఎంహెచ్‌వో జగన్మోహనరావు


విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న జగన్మోహనరావు

గరుగుబిల్లి: బాలికల్లో రక్తహీనత నివారణకు కృషి చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో టి.జగన్మోహనరావు అన్నారు. మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను ఆయన శుక్రవారం సందర్శించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్, వైద్య సిబ్బంది, హాస్టల్ సిబ్బందితో సమీక్షించారు. విద్యార్థుల ఆరోగ్య వివరాల రికార్డులు, సిక్ రిజిస్టర్లను పరిశీలించారు. హిమోగ్లోబిన్ పరీక్షల నివేదికలను తరగతుల వారీగా పరిశీలించి, రక్తహీనతతో ఉన్న విద్యార్థులకు తీసుకుంటున్న నివారణ చర్యలపై అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు వేయిస్తున్నామని, అదే విధంగా బరువు తక్కువగా ఉన్న విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని ప్రిన్సిపాల్ ఎస్.సంధ్యారాణి తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో బి.చిన్నమ్మి, సూపర్‌వైజర్ జయగౌడ్, ఎంఎల్‌హెచ్‌వో వెంకటలక్ష్మి, హాస్టల్ ఏఎన్ఎం స్వర్ణలత, వైద్య సిబ్బంది, గురుకుల పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పశువుల అక్రమ రవాణా అడ్డగింత


వ్యానులో పశువులను తరలిస్తున్న దృశ్యం

పాచిపెంట: పశువులను అక్రమంగా రవాణా చేస్తున్న మూడు వాహనాలను పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద స్థానిక పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ఎస్‌ఐ వెంకటసురేష్ తన సిబ్బందితో చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా, అటుగా వస్తున్న పశువుల వాహనాలను నిలుపుదల చేశారు. ఒడిశా నుంచి మానాపురం గ్రామానికి పశువులను అక్రమంగా రవాణా చేస్తున్నట్టు గుర్తించారు. మూడు వాహనాలను స్వాధీనం చేసుకుని, వాహన చోదకులపై కేసు నమోదు చేశారు.

మద్యం సీసాల స్వాధీనం

సీతానగరం: మండలంలోని రామవరం గ్రామంలో ఓ వ్యక్తి నుంచి అక్రమంగా నిల్వ ఉంచిన 58 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ ఎం.రాజేష్ శుక్రవారం స్థానిక విలేకర్లకు తెలిపారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేశామని చెప్పారు.

ఫారెస్ట్ రేంజర్ అనుమానాస్పద మృతి


నాయక్(ఫైల్)

ఒడిశా

రాయగడ: ఫారెస్ట్ రేంజర్ సంజయ్ నాయక్(35) అనుమానాస్పదంగా మృతిచెందారు. వివరాలు ఇలా ఉన్నాయి. రాయగడ సొండి వీధికి చెందిన సంజయ్ నాయక్ భవానీపట్నంలో ఫారెస్ట్ రేంజర్‌గా పనిచేస్తున్నారు. ఈయనకు నాలుగు రోజుల క్రితం బలంగీర్ జిల్లాకు బదిలీ అయింది. బలంగీర్‌లో చేరాల్సిన ఆయన బుధవారం తన వసతిగృహంలో ఫ్యాన్‌కు వేలాడుతూ విగతజీవిగా కనిపించాడు. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, బంధువులకు అప్పగించారు. అయితే నాయక్ మృతికి తన పైఅధికారి దేవేంద్రబెహరా వేధింపులే కారణమని మృతుడి సోదరుడు రవినారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వేధింపులకు సంబంధించి లేఖ తన సోదరుడి పోకెట్‌లో లభ్యమైందని, అది పోలీసుల వద్ద ఉందని రవినారాయణ తెలిపారు. ఈ మేరకు తమకు న్యాయం చేయాలని శుక్రవారం రాయగడలో పర్యటించిన అటవీ పర్యావరణ శాఖ మంత్రి గణేష్‌రామ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఫారెస్ట్ అధికారి దేవేంద్రబెహరాపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు స్పందించిన మంత్రి.. దర్యాప్తునకు ఆదేశిస్తానని హామీ ఇచ్చారు.

బీజేపీ వంద రోజుల పండగ

రాయగడ: రాష్ట్రంలో ముఖ్యమంత్రి మోహన్ మాఝి ప్రభుత్వం ఏర్పాటై వంద రోజులు పూర్తయిన సందర్భంగా అటవీ, పర్యావరణ శాఖామంత్రి గణేష్‌రామ్ కుంటియా శుక్రవారం రాయగడ జిల్లాలో పర్యటించారు. స్థానిక రైల్వే మైదానంలో మూడు రోజుల పాటు జరగబోయే జిల్లా స్థాయి వికశ్ మేళా కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వంద రోజుల్లో మోహన్ మాఝి ఎన్నో ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సుభద్ర యోజన లబ్ధిదారులకు రూ.5 వేల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ పారుల్ పట్వార్, సబ్ కలెక్టర్ కళ్యాణి సంఘమిత్ర దేవి, జిల్లా ఎస్పీ హరీష్ బీసీ, జడ్పీ కార్యనిర్వాహణాధికారి నిహార్ రంజన్ కహర్, అదనపు కలెక్టర్ భాస్కర్‌చంద్ర రోయిత్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికే పెద్ద పీట

● కూటమి ప్రభుత్వానికి వంద రోజులు

● జిల్లా వ్యాప్తంగా 'ఇది మంచి ప్రభుత్వం'

● సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై అవగాహన


కొమరాడ: అర్తాంలో మాట్లాడుతున్న కురుపాం నియోజకవర్గ ప్రత్యేకాధికారి రామచంద్రరావు


సాలూరు: మామిడిపల్లిలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కోలాటం ఆడుతున్న మంత్రి సంధ్యారాణి

కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజల సంక్షేమానికే పెద్ద పీట వేస్తుందని ఆ పార్టీ నాయకులు అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి వంద రోజులు పూర్తయిన సందర్భంగా శుక్రవారం 'ఇది మంచి ప్రభుత్వం' అనే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా కూటమి నాయకులు, అధికారులు, సచి వాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి వంద రోజుల్లో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. ఇంటింటికి వెళ్లి స్టిక్కర్లు అతికించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: విజయచంద్ర

పార్వతీపురం రూరల్: ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. ములగ పంచాయతీలో శుక్రవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వంద రోజుల్లో ఎన్నో అభివృద్ధి కార్య క్రమాలు చేపడుతూ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి, టీడీపీ అరకు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు కె.శ్రావణ్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు గొట్టాపు వెంకట్‌నాయుడు, పార్టీ నాయకులు, ఎంపీడీవో షేక్ మహ్మద్ అబీబ్ తదితరులు పాల్గొన్నారు.

వంద రోజుల్లోనే రాష్ట్రానికి స్వేచ్ఛ: జయకృష్ణ

పాలకొండ: వంద రోజుల్లోనే రాష్ట్రానికి స్వేచ్ఛ, స్వాతంత్ర్యం వచ్చాయని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. పట్టణంలోని 17, 18, 19 వార్డులతో పాటు మండలంలోని ఎల్ఎల్‌పురం, ఓని, లుంబూరు గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు, అభివృద్ధిపై వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తున్నారన్నారు. మెగా డీఎస్సీతో నిరుద్యోగ యువతకు అండగా నిలుస్తున్నారన్నారు. అన్న క్యాంటీన్లు, పింఛన్ల పెంపు, ఒకటో తేదీన ఉద్యోగులకు జీతాలు, ఉచిత గ్యాస్ పంపిణీ ప్రకటన వంటివి నిదర్శనమన్నారు. జనసేన ఉమ్మడి జిల్లాల ఉపాధ్యక్షుడు గర్భాన సత్తిబాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నేడు గోపాలపురంలో

మక్కువ: ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని గోపాలపురం గ్రామంలో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి శనివారం పర్యటించనున్నారు. ఈ మేరకు టీడీపీ మండల అధ్యక్షుడు గుల్ల వేణుగోపాల్, జనసేన సాలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి గేదెల రిషివర్ధన్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని కూటమి నాయకులంతా హాజరుకావాలన్నారు.

కిచ్చాడలో..

కురుపాం: మండలంలోని కిచ్చాడ గ్రామంలో శనివారం నిర్వహించనున్న ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి హాజరు కానున్నట్టు ఎంపీడీవో అప్పారావు తెలిపారు.


కురుపాం: ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రచారం


గరుగుబిల్లి: గొట్టివలసలో ..


కురుపాం రూరల్: రస్తాకుంటుబాయిలో..


పాలకొండ: కస్పావీధిలో..

వరద బాధితులకు సాయం


సీఎంకి చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం: విజయవాడ వరద బాధితుల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శుక్రవారం అమరావతిలో 15లక్షల 560 రూపాయల చెక్కును అందించారు. ఆమె వెంట టీడీపీ సీనియర్ నాయకులు దత్త లక్ష్మణరావు, డొంకాడ రామకృష్ణ, బొంగు సురేష్, ఎన్.కృష్ణబాబు, పోలూరు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● **పార్వతీపురంటౌన్:** విజయవాడ వరద బాధితుల కోసం రాష్ట్ర నెయ్యిల కుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబుకు రూ.6.50లక్షలు అందజేసినట్టు ఆ సంఘ జిల్లా గౌరవాధ్యక్షుడు, టీడీపీ నాయకుడు తాతపూడి వెంకటరావు శుక్రవారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర నెయ్యిల కుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కె.గోపి, గౌరవాధ్యక్షు డు పి.సోమశేఖర్‌లతో పాటు సంఘ సభ్యుడు మంత్రి కొల్లు రవీంద్ర సమక్షంలో సీఎంకు విరాళం అందించామని చెప్పారు. ● **గరుగుబిల్లి:** విజయనవాడ వరద బాధితులకు మండలంలోని పలువురు విరాళాలు అందిస్తున్నారు. నాగూరు ఎంపీటీసీ సభ్యుడు ద్వారపురెడ్డి సత్యనారాయణ రూ.45వేలు, ఎంపీపీ ఉరిటి రామారావు రూ.25వేలు, రావుపల్లికి చెందిన బోను సత్యనారాయణ ఆధ్వర్యంలో రూ.30వేలను ఎమ్మెల్యే జగదీశ్వరికి శుక్రవారం అందించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి/ పార్వతీపురంటౌన్: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాంగా శుక్రవారం పట్టణంలోని గణేష్‌నగర్ కాలనీలో ఆయన మొక్కలు నాటారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపు శ్రీనివాసరావు, టీడీపీ నాయకుడు బార్నాల సీతారాం, మున్సిపల్ ఛైర్‌పర్సన్ గౌరీశ్వరి, కమిషనర్ కె.శ్రీనివాసరావు, కౌన్సిలర్లు కోరాడ నారాయణరావు, బడే గౌరునాయుడు, జనసేన నాయకుడు చందక అనిల్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సీఎం సేవలు అమోఘం

జియ్యమ్మవలస: విపత్తుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు అందిస్తున్న సేవలు అమోఘమని రజక చైతన్య సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు ఏలూరు సింహాచలం అన్నారు. ఈనెల 18, 19 తేదీల్లో ఆయన విజయవాడలోని ఆపదలో ఉన్న 50 రజక కుటుంబాలకు దుస్తులు నిత్యావసర వస్తువులు, బియ్యం పంపిణీ చేసి శుక్రవారం తన స్వగ్రామం చినమేరంగి చేరుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దీపావళి నుంచి తెలుపు రేషన్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఉచితంగా మూడు గ్యాస్ సిలెండర్లు ఇస్తామనడం హర్షించదగ్గ విషయమన్నారు. అలాగే బీసీలకు 33 శాత రిజర్వేషన్ నిర్ణయించి కేంద్రానికి పంపడం చాలా ఆనందదాయకమన్నారు.

నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

సీతంపేట రూరల్: స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను ఐటీడీఏ ఏపీవో చినబాబు శుక్రవారం ప్రారంభించారు. ఈ పోటీల్లో నాలుగు మండలాల నుంచి 600 మంది విద్యార్థులు పాల్గొన్నారు. స్పోర్ట్స్ ఇన్‌చార్జి జాకబ్ దయానంద్, ఏటీడబ్ల్యూవో మంగవేణి, పాఠశాల హెచ్‌ఎంలు చంద్రరావు, పద్మశ్రీ, వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ● **కురుపాం:** కురుపాంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఈ పోటీలను పాలకొండ డిప్యూటీ డీఈవో కృష్ణమూర్తి ప్రారం భించారు. ఎంఈవో సత్యనారాయణ, హెచ్‌ఎంలు టి.శంకరరావు, జి.రామ గోవిందు, క్రీడా పోటీల నియోజకవర్గ ఇన్‌చార్జి బి.మాధవరావు, జిల్లా వీడీఎస్‌సీ చంద్రమోహన్, ఎస్‌జీఎస్ సెక్రటరీ మురళీకృష్ణ, పీటీలు, పీడీలు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

పార్వతీపురంటౌన్: కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆర్టీసీ ఎస్‌అండ్‌ఎస్ వర్కర్స్ ఫెడరేషన్ నూతన అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.శ్రీనివాసరావు, ఏఎస్ తాతబాబు తెలిపారు. శుక్రవారం పార్వతీపురం డిపో ఎస్‌అండ్‌ఎస్ డబ్ల్యూ ఎఫ్ ఉమ్మడి జిల్లా సంఘ అధ్యక్షుడు వి.రాములు ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. గౌరవాధ్యక్షుడిగా కేఈ నాయుడు, ఉపాధ్యక్షుడిగా ఎంపీఏ నాయుడు, సహాయ కార్యదర్శిగా ఎస్వీ రమణ, కోశాధికారిగా టి.వెంకటిలను, సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డిపో మేనేజర్ దుర్గాదేవికి వినతిపత్రాన్ని అందజేశారు.

నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

గరుగుబిల్లి: మహిళలపై జరుగుతున్న నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ పి.రమేష్‌నాయుడు సూచించారు. శుక్రవారం రావివలస కేజీబీవీ పాఠశాల విద్యార్థినులకు పోక్సో కేసులు, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వల్ల పలు సమస్యలు ఎదుర్కోవల్సి వస్తుందన్నారు. ప్రత్యేకాధికారి ఎస్.ఛాయాదేవి, సిబ్బంది, మహిళా పోలీసు ఉరిటి హేమలత తదితరులు పాల్గొన్నారు.

గోముఖిలోకి వరదనీరు

మక్కువ: ఇటీవల ఎగువన కురుస్తున్న వర్షాలకు శంబర గ్రామ సమీపంలో ఉన్న గోముఖి రిజర్వాయర్ లోకి వరదనీరు వచ్చి చేరింది. దీంతో ఇరిగేషన్ అధికారు లు శుక్రవారం గోముఖి నదిలోకి 200 కూసెక్కుల వరదనీటిని విడిచిపెట్టారు.

గిరిజన గ్రామాల అభివృద్ధికి 'పీసా'

● ఎమ్మెల్యే జయకృష్ణ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

సీతంపేట రూరల్: గిరిజన గ్రామాల అభివృద్ధికే పీసా చట్టంపై గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తెలిపారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో పీసా చట్టంపై సర్పంచ్‌లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ షెడ్యూల్డ్ ప్రాంతాల్లో పీసా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని అన్నారు. రాజకీయాలకు అతీతంగా పీసా చట్టం గ్రామసభల్లో అందరూ పాల్గొని ఉపాధ్యక్షులు, సెక్రటరీలను ఎన్నుకోవాలని సూచించారు.

ఎన్జీవో సంస్థలను నియంత్రించాలి

గిరిజన ప్రాంతాల్లో గిరిజనుల నిధులతో పనిచేస్తున్న ఎన్జీవో సంస్థలను నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే జయకృష్ణ అన్నారు. సీతంపేట ఏజెన్సీలో ఎన్జీవో సంస్థ ఎవరి కోసం పనిచేస్తుందో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. మండలంలో 41 పంచాయతీల్లో నిర్వహించే గ్రామసభల్లో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఐటీడీఏ పీవో సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి, ఏపీవో చినబాబు, ఎంపీడీవో గీతాంజలి, ఎంపీపీ బి.ఆదినారాయణ, జడ్పీటీసీ సవరలక్ష్మి, తహసీల్దార్ అప్పలరాజు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఫ్రీహోల్డ్ పట్టా భూముల పరిశీలన


రికార్డులు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

మక్కువ: వెంకటభైరిపురం గ్రామంలో సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్ శుక్రవారం పర్యటించారు. గ్రామంలో ఉన్న ఫ్రీహోల్డ్ పట్టా భూముల ప్రక్రియను పరిశీలించారు. పట్టాలు పొందిన రైతులతో మాట్లాడి పంటల సాగు వివరాలు తెలుసుకున్నారు. భూ సంబంధిత సమస్యల సత్వర పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ షేక్ ఇబ్రహీం, ఆర్ఐ స్వాతి, సర్వేయర్ లింగమూర్తి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. ● **గుమ్మలక్ష్మీపురం:** గుమ్మలక్ష్మీపురంలో తహసీల్దార్ అప్పారావు ఫ్రీహోల్డ్ అసైన్‌మెంట్ పట్టాలను శుక్రవారం పరిశీలించారు. అనంతరం సంబంధిత భూములను పరిశీలించారు. 2004 ముందు ఇచ్చిన డీపట్టా భూములను ఫ్రీహోల్డ్ అయింది లేనిది పరిశీలించారు. సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు ఉన్నారు.

గిరిజన ప్రాంతాభివృద్ధికి సహకరించండి

సీతంపేట రూరల్: గిరిజన ప్రాంత అభివృద్ధికి ఐటీడీఏ నుంచి పూర్తి సహకారం అందించాలని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డిని కోరారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో నూతనంగా పీవోగా బాధ్యతలు చేపట్టిన యశ్వంత్‌కుమార్‌రెడ్డిని కలిసి దుశ్శాలువాతో సత్కరించారు. అనంతరం ప్రభుత్వ పథకాలు, గిరిజనాభివృద్ధికి సంబంధించిన అంశాలపై చర్చించారు.

పార్వతీపురం డిపో పరిధిలో 66 బస్సులు

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం ఆర్టీసీ డిపో పరిధిలో 66 బస్సులు నడుపుతున్నామని, ప్రయాణికుల సంఖ్య కూడా పెరిగిందని ఆర్టీసీ డిపో మేనేజర్ దుర్గ తెలిపారు. ఆమె శుక్రవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల సర్వీసులకు నష్టం వస్తున్నా ప్రజల సౌకర్యార్థం బస్సులు నడుపుతున్నామని చెప్పారు. ఈ 15 రోజుల్లో పార్వతీపురం డిపోకు రెండు బస్సులు వచ్చాయని, మరో రెండు కొత్త బస్సులు రానున్నాయని తెలిపారు. పల్లెవెలుగు సర్వీసులు కూడా కొత్త బస్సులు వాడుతున్నామన్నారు. అనంతరం ఏఎన్ఎల్ రీజియన్ కమర్షియల్ మేనేజర్ దివ్య మాట్లాడుతూ గత ఏడాది పది కోట్ల రూపాయల వ్యాపారాన్ని ఆర్టీసీ ఏఎన్ఎల్ ట్రాన్స్‌పోర్టు ద్వారా చేశామని తెలిపారు. ఈ ఏడాది ఈ వ్యాపారాన్ని 12 కోట్ల రూపాయలు పైగా చేయాలని టార్గెట్‌గా నిర్ణయించుకున్నామన్నారు. ప్రతి మండల కేంద్రంలో కూడా ఏఎన్ఎల్ పార్శిల్ సర్వీసులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆసక్తి ఉన్న ఫ్రాంచైజ్ తమకు సంప్రదించాలన్నారు. ప్రస్తుతం 50కి పైగా ఏఎన్ఎల్ డిస్ట్రిబ్యూటర్ ఉన్నారన్నారు.

క్లుప్తంగా..

విశ్రాంత ఉద్యోగుల నాయకుడు మృతి

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి సంపంగి తిరుపతి రావు శుక్రవారం ఆకస్మికంగా మృతి చెందారు. గురువారం రాత్రి అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో వెంటనే విశాఖపట్నం తరలించారు. అయినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. ఆయన మృతి పట్ల జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డీజీ ప్రసాదరావు, రాష్ట్ర నాయకుడు రామ్మూర్తి తదితరులు సంతాపం తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

భామిని: భామిని వంశధార నదీతీరం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్టు బత్తిలి ఎస్‌ఐ అనీల్‌కుమార్ తెలిపారు. గురువారం రాత్రి పెద్దదిమిలి వద్ద పట్టుబడిన ఇసుక ట్రాక్టర్‌ను బత్తిలి పోలీస్‌స్టేషన్‌కు తరలించి, డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని చెప్పారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

సాలూరు రూరల్: గర్భిణులు తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలని ఎంపీడీవో గొల్లపల్లి పార్వతి సూచించారు. మామిడిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం గర్భిణులకు సీమంతాలు చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లక్ష్మి, అనురాధ, ఖరాసవలస ఎంపీటీసీ అప్పికొండ రమాదేవి, డొంక అన్నపూర్ణ పాల్గొన్నారు.

తిరుమల పవిత్రతను కాపాడాలి

కురుపాం: అవినీతి, అక్రమాలకు కేరాఫ్ గత ఐదు ఏళ్ల వైసీపీ పాలన అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ విమర్శించారు. తిరుమలలో కల్తీ నెయ్యి వినియోగంపై స్పందించిన ఆయన శుక్రవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. తిరుమల లడ్డూ కల్తీ సహా అన్ని అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.

సర్పంచ్‌ల నిరసన

పాచిపెంట: పంచాయతీ పరిధిలో చేస్తున్న అభివృద్ధి పనులకు చెల్లించే సొమ్ము నేరుగా సర్పంచ్‌ల అకౌంట్‌లో జమ చేయాలని కోరుతూ పలువురు సర్పంచ్‌లు శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఎన్ఆర్‌జీఎస్ అభివృద్ధి పనులకు సంబంధించి సర్పంచ్ ఛైర్మన్‌గా ఉన్నారని చెప్పారు. ఈ మేరకు గ్రామసభలో తీర్మానం చేసుకుని సంబంధిత అధికారులకు నివేదిక అందజేశామన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో మండలంలోని పలువురు సర్పంచ్‌లు పాల్గొన్నారు.


నిరసన తెలపుతున్న సర్పంచ్‌లు